హైదరాబాద్ వార్త



# భక్తిశ్రద్ధలతో బక్రీద్



చారిత్రక మీరాలం ఈద్గాలో ముస్లిం సోదరులు ప్రార్ధనలు నిర్వహిస్తున్న దృశ్యం



చారిత్రక మీరాలం ఈద్గా వద్ద శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్న నగర పోలీస్ శాఖ ఉన్నతాధికారులు



**చార్మినార్, జూన్ 17 ప్రభాతవార్త :** బక్రీద్ పండుగను ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న చారిత్రక మీరాలం ఈద్గాలో ముస్లిం సోదరులు సామూహిక ప్రార్ధనలు నిర్వహించారు. ప్రార్ధనలు అనంతరం ముస్లిం సోదరులు ఒకరికి ఒకరూ పండుగ శుభా కాంక్షలు తెలియ జేసుకున్నారు. బక్రీద్ సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు పాతనగరంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. మీరాలం ఈద్గాలో జరిగిన సామూహిక ప్రార్ధనలలో తాడ్‌బన్, శాలిబండ, హసన్‌నగర్ ,బహదూర్‌పుర, కాజీపుర, కామాటిపుర, హుస్సేనీఆలం, నవాబ్‌సాహెబ్‌కుంట, తీగలకుంట, జహానుమా, శాస్త్రిపురం, కిషన్‌బాగ్‌తో పాటు హైదరాబాద్ పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది ముస్లిం సోదరులు పాల్గొన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు శాఖ ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేసింది. ఎంఐఎం కార్పొరేటర్ల పలువరు పాల్గొన్నారు.

**చారిత్రక మక్కామసీదులో ప్రార్ధనలు**

చార్మినార్ సమీపంలోని చారిత్రక మక్కామసీదులో సోమవారం బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులు సామూహిక ప్రార్ధనలు నిర్వహించారు. మొగల్‌పుర, చార్మినార్, మీరాలంమండి, ఘాన్సీ బజార్, మఛలీకమాన్, లాడ్‌బ. ఆర్, గుల్జారాహౌస్, భవానీనగర్, మీర్‌చౌక్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు చారిత్రక మక్కా మసీదులో జరిగిన ప్రార్ధనలలో పాల్గొన్నారు. కాగా మీరాలం ఈద్గాలో నగర పోలీస్ అడిషనల్ సిపి విక్రమాన్ సింగ్, జాయింట్ సిపి విశ్వ ప్రసాద్, సిఎఆర్ హెడ్ క్వార్టర్స్ జాయింట్ సిపి సత్యనారాయణ, దక్షిణ మండలం డిసిపి స్నేహా మెహ్రా, అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

# దంచి కొట్టిన వర్షం

**-ఉరుములు, మెరుపులతో భారీ వర్షం -బలమైన గాలల ధాటికి విరిగిపడిన చెట్లు - పలుచోట్ల తీవ్ర ట్రాఫిక్ జామ్**



**హైదరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త**

నగరంలో భారీ వర్షం పడింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృమై భారీ వాన కురిసింది. వర్షం ధాటికి చాలా ప్రాంతాల్లో చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. నైరుతి రుతుపవనాలు విస్తరించిన నేపథ్యంలో మరో మూడురోజులు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. కాగా, ఏకదాటిగా కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు నీటమునగగా, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. వివిధ పనులపై బయటకు వెళ్లిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గచ్చిబౌలి, హైటెకిసిటీ, మాదాపూర్, రాయదుర్గం, షేక్‌పేట, ఖైరతాబాద్, పంజాగుట్ట, లక్డీకపూల్, అమీర్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సికింద్రాబాద్, అంబర్‌పేట, రామంతాపూర్, బోడుప్పల్, రాజేంద్రనగర్, అత్తాపూర్, కిస్మత్‌పురా, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ, లంగర్‌హౌస్, గండిపేట్, శివరాంపల్లి, హయత్‌నగర్, వనస్థలిపురం, ఎల్బీనగర్, నాగోల్, చైతన్యపురి, గడ్డిఅన్నారం, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, సైదాబాద్, సంతోష్‌నగర్, బిఎన్‌రెడ్డినగర్, మీర్‌పేట్, హైకోర్టు, పాతబస్తీ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో రహదారులపైకి వరదనీరు చేరింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వనస్థలిపురంలో జాతీయ రహదారిపై భారీగా వరద నీరు చేరింది. చింతల్‌కుంట వద్ద వర్షపు నీరు చేరి చెరువును తలపించింది. పనామా-ఎల్బీనగర్ మధ్య వాహనాలు స్తంభించిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షంతో రోడ్లపై వాహనదారులు అవస్థలు పడ్డారు. టోలిచౌకి, గోల్కొండ ఎండిలైన్స్ లోని ఈదురు గాలులతో 200 సంవత్సరాల నాటి భారీ చెట్టు నేలకొరిగింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి తలకు గాయాలు కాగా, 4 బైక్స్ ధ్వంసమయ్యాయి.

వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. జిహెచ్‌ఎంసి విపత్తు నిర్వహణ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి.

## 70అడుగులతో ఖైరతాబాద్ మహాగణపతి

**-కర్ర పూజ నిర్వహించిన గణేష్ ఉత్సవ కమిటీ**



**ఖైరతాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** వినాయకచవితి అనగానే తెలంగాణ ప్రజలకు మరీ ముఖ్యంగా హైదరాబాద్ వాసులకు గుర్తొచ్చేది ఖైరతాబాద్ గణపతి, ఇక్కడి మహాగణపతి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ది. రాష్ట్రంలో అత్యంత ఎత్తయిన, ఎంతో విశిష్టమైన గణపయ్య ఇక్కడ ఏటా కొలువవుతాడు. ఈఏడాది సెప్టెంబర్ 7వ తేదీన వినాయక చవితిపండగ రానుంది. ఈనేపథ్యంలో ప్రతిఏడు నిర్మల ఏకాదశి రోజు న గణేష్ విగ్రహ ప్రతిష్టకు కర్ర పూజ నిర్వహిస్తారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కరర పూజ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే దానం నాగేందర్, ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం మహాగణపతి విగ్రహ ఎత్తు 70అడుగులుగా నిర్ణయించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 11రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని పోలీస్ భద్రత పెంపు విషయాన్ని సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. అన్ని శాఖల సమన్వయంలో ఉత్సవాలు ఘనంగా చేస్తామన్నాని పేర్కొన్నారు.

## కనుల పండువగా టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామికి పుష్పయాగం

**-ముగిసిన దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు**



శ్రీవారికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేద పండితులు

**సైఫాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్‌లోని టిటిడి (తిరుమల తిరుపతి దేవస్థానములు) బాలాజీ భవన్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం 19వ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9.30 గంటలకు శ్రీవారికి మహాపూర్ణహుతి, 10.30 గంటలకు చక్రస్నానం, సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం వైభవంగా కన్నుల పండువగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని పై సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పెద్ద ఎత్తున అన్ని రకాల పుష్పాలతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి పుష్పయాగం అద్బుతంగా రంగరంగా వైభవంగా కన్నుల పండువగా జరిగింది. వేలాది మంది భక్తులు గోవింద, గోవింద అంటూ పెద్ద ఎత్తున నామస్మరణం గావించారు. పిల్లల నుంచి వృద్దుల వరకు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ నెల 12వ తేదీ సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమైన ఈ బ్రహ్మోత్సవాలు రాత్రి 9 గంటలకు జరిగిన ధ్వజాపరోహణం కార్యక్రమంతో ముగిశాయి. ఆరు రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సోవాల్లో నిత్యం వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. నిత్యం పురవీధుల్లో వివిధ వాహనాలపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఊరేగింపులు ఘనంగా జరిగాయి. ప్రతి రోజు భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణతోపాటు ఉదయం అల్పహారం, మధ్యాహ్నాం, రాత్రికి అన్నప్రసాద వితరణ జరిగింది. టిటిడి డిప్యూటి ఈవో రమేష్‌బాబు, లోకల్ అడ్వయిజరి కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు, బ్రహ్మోత్సవాల దాత త్రినాథ్‌బాబు, హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి. మహాలక్ష్మీరామన్‌గౌడ్, దేవాలయం ఉద్యోగులు, సిబ్బంది, శ్రీవారి సేవకులు భక్తులకు సేవలు అందించారు.

## కానిస్టేబుల్ సురేష్‌కు సిఎం ప్రశంశలు

**అత్తాపూర్ జూన్17, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ మండల పరిధిలోని మహావీర్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఆదివారం యూపిఎస్సీ పరీక్ష రాసేందుకు వెళ్తున్న యువతికి ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేష్ లిఫ్ట్ ఇచ్చి సమయానికి పరీక్ష సెంటర్‌కు చేర్చాడు. దీంతో ఆ విడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సిఎం రేవంత్ రెడ్డి స్పందించి కానిస్టేబుల్‌ను సురేష్‌ను మెచుకున్నాడు. వాహనాల నియంత్రణ మాత్రమే తన పని అనుకోకుండా సాటి మనిషికి సాయం చేయడం బాధ్యతని భావించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ సురేష్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## కేబుల్ బ్రిడ్జీ మీద యువతి ఆత్మహత్యాయత్నం



కేబుల్ బ్రిడ్జీ మీద నుంచి దూకేందుకు యత్నిస్తున్న యువతి సరళను కాపాడుతున్న పోలీసులు

**గచ్చిబౌలి, జూన్ 17 ప్రభాతవార్త** దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి మీద నుంచి దూకి ఆత్మహత్యకు ఓ యువతి యత్నించగా, పోలీసులు సకాలంలో స్పందించి యువతిని అడ్డుకున్నారు. ఇప్పటికే దుర్గం చెరువు ఆత్మహత్యల స్పాట్‌గా మారడంతో పోలీసులు ఏర్పాటు చేసిన నిఘా వ్యవస్థ సత్ఫలితాలను ఇచ్చి యువతిని రక్షించగలిగారు. ఆత్మహత్యకు యత్నించిన యువతి మానసిక ఇబ్బందులతో బాధపడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిద్రమాత్రలు మింగినట్లు యువతి చెప్పడంతో వెంటనే పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... సోమవారం మద్యాహ్నం మాదాపూర్ దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జీ మీదకు వచ్చిన ఓ యువతి అనుమానస్పదంగా సంచరించింది. కేబుల్ బ్రిడ్జీ మీద నుంచి దుర్గం చెరువు నీటిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నిస్తుండగా, అప్పటికే యువతి కదలికలపై అనుమానంతో ఉన్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలికి చేరుకొని యువతిని రక్షించారు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకోవడం నిమిషం ఆలస్యమైనా యువతి కేబుల్ బ్రిడ్జీ మీద నుంచి దుర్గంచెరువు నీటిలోకి దూకేదని స్థానికులు తెలిపారు. మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు కేబుల్ బ్రిడ్జీ మీద గస్తీ నిర్వహిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకోవడంతో పోలీసులు వెంటనే స్పందించారు. కాపాడిన యువతిని కేబుల్ బ్రిడ్జీ మీద నుంచి తీసుకురాగా, తాను నిద్రమాత్రలు సైతం మింగానని యువతి చెప్పడంతో వెంటనే పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సదరు యువతిని నగరానికి చెందిన సరళగా పోలీసులు గుర్తించారు. సరళ గతకొంత కాలంగా మానసిక ఇబ్బందులతో బాధపడుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఆసుపత్రిలో చికిత్స అనంతరం యువతిని ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. యువతి ఆత్మమత్యయత్నానికి గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

## ఓయో హోటల్ భవనంపై నుంచి దూకి యువకుడి ఆత్మహత్య

**సైబరాబాద్ ప్రతినిధి, జూన్ 17 ప్రభాతవార్త** మాదాపూర్‌లోని ఓయో హోటల్‌లో ఉంటున్న ఓ యువకుడు అదే హోటల్ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. భవనం 6వ అంతస్థు నుంచి దూకడంతో తీవ్ర గాయాలతో యువకుడు అక్కడికక్కడే మ ృతిచెందాడు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లాకు చెందిన సాయి నగరంలో ఉంటూ సివిల్స్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్నాడు. ఇందులో భాగంగా ఇటీవల జరిగిన ప్రిలిమ్స్ పరీక్ష రాసిన సాయి మెయిన్స్ కోసం సిద్దం అవుతున్నాడు. ఆదివారం తన నలుగురు ఫ్రెండ్స్‌తో కలిసి మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో గల ఆర్‌కెఎస్ ప్రెస్టీజ్ ఓయో హోటల్‌కు వచ్చాడు. అర్థరాత్రి ఓయో హోటల్ భవనం 6వ అంతస్థు నుంచి కిందకు దూకి సాయి ఆత్మహత్య చేసుకున్నాడు. 6వ అంతస్థు నుంచి దూకడంతో తీవ్ర గాయాలైన సాయి అక్కడికక్కడే మ ృతిచెందాడు. సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మ ృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా సాయి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సివిల్స్ ప్రిలిమ్స్ రాసి మెయిన్స్ కోసం సిద్దం అవుతున్న సాయి ఆత్మహత్య చేసుకోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సాయి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడా లేక ప్రమాదవశాత్తు కిందపడిపోయాడా, మరేదైనా కారణం ఉందా అనే విషయమై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈమేరకు మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## బిజెపి నేత అమర్‌సింగ్‌పై చేయి చేసుకున్న ఎసిపి

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కార్వాన్ నియోజకవర్గం బీజేపీ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన అమర్ సింగ్‌పై అసీఫ్‌నగర్ ఏసీపీ బీ.కిషన్ కుమార్ చేయి చేసుకున్నారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, ఆదివారం రాత్రి 10 గంటల తరువాత గుడిమల్కాపూర్ కూడలి వద్ద ఉన్న గోల్డెన్ ప్యాలెస్ హోటల్‌ను మూసి వేయాలని అసీఫ్‌నగర్ ఏసీపీ కిషన్ ఆదేశించారు. అదే సమయానికి సంఘటనా స్థలానికి చేరుకున్న అమర్ సింగ్, ఇంకా 10:30 కూడా కాలేదని, కొంత సమయం ఇస్తే మూసివేస్తామని చెప్పడంతో వారిరువురి మద్యా వాగ్వాదం జరిగింది. మాటా మాటా పెరగడంతో ఆవేశానికి లోనైన ఏసీపీ కిషన్, అందరూ చూస్తుండగానే అమర్ సింగ్‌ను నెట్టివేసి చెంపదెబ్బ కొట్టారు. దాంతో బీజేపీ కార్యకర్తలతో కలిసి అమర్ సింగ్ అభిమానులు పోలీస్ స్టేషన్ ఎదుట నినాదాలు చేశారు. తనపై దాడి జరిగిన సంఘటనపై స్పందిస్తూ అమర్ సింగ్ తీవ్రంగా ఖండించారు. సదరు ఏసీపీ గురించి ఉన్నత పోలీస్ అధికారులకు, బండి సంజయ్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. ఏసీపీ అయితే చేయి చేసుకోవచ్చా అంటూ ప్రశ్నించారు. హోటల్ ముగిసే సమయమైతే కేసు బుక్ చేయాలి గానీ అందరి ముందూ కొట్టి అవమానించారంటూ వాపోయారు.

# ఐటి కారిడార్‌లో ఆగని బైక్ స్టంట్లు

**-స్టాపర్లు అడ్డుపెట్టడంతో బైక్‌లను వదిలి పారిపోయిన రేసర్లు**

**-బైక్ నెంబర్ల ఆధారంగా 9మంది అరెస్టు**

**-అడ్డుకునేందుకు యత్నించిన పోలీసుల మీదకు దూసుకువచ్చిన బైకర్లు**



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

**గచ్చిబౌలి, జూన్ 17 ప్రభాతవార్త** పోలీసులు ప్రత్యేక నిఘా పెడుతున్నా, తరచూ రేసర్లను అరెస్టు చేస్తున్నా ఐటి కారిడార్‌లో మాత్రం బైక్ రేసులు ఆగడం లేదు. సువిశాలంగా ఉండే ఐటి కారిడార్ రహదారులు అర్థరాత్రి బైక్ స్టంట్లకు వేదికలుగా మారుతున్నాయి. బైక్ రేసుల కారణంగా సాదారణ ప్రయాణికులు ప్రమాదాలకు గురికావడం, స్థానికంగా భయాందోళనలు నెలకొంటుండడంతో పోలీసులు ఈ బైక్ రేసుల మీద ప్రత్యేక నిఘా పెట్టారు. గతంలో పలుమార్లు బైక్ రేసులకు నిర్వహిస్తున్న ప్రాంతాల మీద దాడులు చేసి పలు బైక్‌లను స్వాధీనం చేసుకోవడంతో పాటు అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహించారు. పోలీసులు ఎంతగా ఉక్కుపాదం మోపుతున్నా ఐటి కారిడార్ పరిధిలో అర్థరాత్రుల్లు బైక్ రేసులు ఆగడం లేదు. వారాంతం వచ్చిందంటే నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఖరీదైన స్పోర్ట్స్ బైక్‌లతో ఐటి కారిడార్‌లో ప్రత్యక్షం అవుతున్న రేసర్లు ప్రమాదకర స్టంట్లు, రేసింగ్‌లతో హంగామా చేస్తున్నారు. వీరి కారణంగా తరచూ ఐటి కారిడార్‌లో రాత్రివేళల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటుండగా, పలుమార్లు రేసర్లు సైతం ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. ఈనెల 1వ తేదీన ఐటి కారిడార్ పరిధిలోని టిహబ్ జంక్షన్, మైహోమ్ భుజా, నాలేడ్జ్ పార్క్ తదితర ప్రాంతాల్లో దాడులు చేసి 50 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బైక్ రేసింగ్‌ల మీద పలు అవగాహన కార్యక్రమాలు, వీడియోలు సైతం చేపట్టారు. కానీ పోలీసులు చేపట్టిన ప్రయత్నాలు బైక్ రేసర్లను అడ్డుకోవడం లేదు. పోలీసులు ఓ ప్రాంతంలో దాడులు చేస్తే రేసర్లు మరో ప్రాంతంలో రేసింగ్‌లు నిర్వహిస్తున్నారు. తాజాగా వారాంతం ఆదివారం అర్థరాత్రి సైతం పలువురు బైకర్లు టిహబ్ జంక్షన్‌లో రేసింగ్‌లు ఏర్పాటు చేశారు. అధునాతన స్పోర్ట్స్ బైక్‌ల మీద ప్రమాదకర స్టంట్లు చేస్తూ స్థానికంగా భయానక వాతావరణం స ృష్టించారు. ఈరేసులపై సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు పెట్రోలింగ్ మొబైల్ పార్టీ, బ్లూకోట్స్ పోలీసులు రేసింగ్‌లను అడ్డుకునేందుకు వెళ్లారు. బైక్‌ల మీద ప్రమాదకర స్టంట్లు చేస్తూ, బిగ్గరగా అరుస్తూ రేసింగ్‌లకు పాల్పడుతున్న బైకులను అడ్డుకునేందుకు పోలీసు సిబ్బంది ప్రయత్నించగా, రేసర్లు తమ బైకులతో పోలీసుల మీదకు దూసుకువచ్చారు. బైక్ రేసర్ల నుంచి తప్పించుకున్న పోలీసులు బైక్‌లను వెంబడించి స్టాపర్లను రహదారికి అడ్డుపెట్టారు. దీంతో కొందరు రేసర్లు అక్కడి నుంచి తప్పించుకోగా, మరికొందరు బైక్‌లను అక్కడే వదిలి సంఘటనా స్థలి నుంచి పారిపోయారు. రేసర్లు వదిలిపెట్టిన బైక్‌లను పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు బైక్ నెంబర్ల ఆధారంగా 9మందిని సోమవారం అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## మహాకాళీ ఆలయ పరిసరాల పరిశీలన



మహాకాళీ ఆలయం వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న ఏసీపీ, ఇన్స్ పెక్టర్‌లు.

**బేగంపేట జూన్ 17, ప్రభాతవార్త** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయం వద్ద సోమవారం మహంకాళీ ఏసీపీ సర్దార్ సింగ్, ఇన్స్ పెక్టర్ పరుశురాంలు ఆలయ పరిసరాలన్నింటినీ పరిశీలించారు. జులై మాసంలో జరగనున్న మహాకాళీ బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఏసీపీ, ఇన్స్ పెక్టర్లు పరిసరాలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్‌రెడ్డితో చర్చించారు. తెలంగాణా రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే లష్కర్ బోనాలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ తో పాటు వివిధ రాష్ట్రాలు, వివిధ దేశాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఉజ్జయినీ మహాకాళీ బోనాలు జులై 21, 22వ తేదీలలో నిర్వహించనున్నారు. ఇప్పటి నుంచే రాష్ట్ర ప్రభుత్వం బోనాలకు సంబంధించిన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా క్యూలైన్ల ఏర్పాటు గురించి ఆలయ ఈ ఓ నుంచి వారు సమాచారం సేకరించారు. బోనాలతో తరలి వచ్చే మహిళా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేలా ఏర్పాట్లు చేసే దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే సాధారణ క్యూలైన్ల గురించి కూడా వారు సమాచారం తీసుకుని ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ సర్దార్ సింగ్ , ఇన్స్ పెక్టర్ పరుశురాంలు మాట్లాడుతూ బోనాల సందర్భంగా అమ్మ వారిని దర్శించుకునేందుకు ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసి జాతరను విజయ వంతం చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. భక్తులకు వీలైనంత వేగంగా అమ్మ వారి దర్శనం చేసుకునే విధంగా చూస్తామని, ఉన్నతాధికారుల సహకారంతో జాతరను ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళీ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ ఉపాశంకర్ తదితరులు ఉన్నారు.

## గచ్చిబౌలి కిడ్నాప్ కేసులో మరో నిందితుడి అరెస్టు

**గచ్చిబౌలి, జూన్ 17 ప్రభాతవార్త** గచ్చిబౌలిలో వ్యాపారవేత్తను కిడ్నాప్ చేసిన ఘటనలో మరో నిందితుడిని గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. అధిక వడ్డీకి అప్పు ఇచ్చిన విషయంలో చెలరేగిన వివాదం వ్యాపారవేత్తతో పాటు అతని వద్ద పనిచేసే వ్యక్తి కిడ్నాప్‌కు దారితీసిన విషయం తెలిసిందే. కాగా కిడ్నాప్‌లో పాలుపంచుకున్న ఇదరు ప్రధాన నిందితులను పోలీసులు అప్పటికే అరెస్టు చేయగా, సోమవారం మరో నిందితుడిని సైతం అదుపులోకి తీసుకున్నారు. జగద్గిరిగుట్టకు చెందిన నరేష్ అనే వ్యక్తి కిడ్నాప్‌లో పాలుపంచుకున్నట్లు గుర్తించిన గచ్చిబౌలి పోలీసులు తాజాగా నరేష్‌ను అరెస్టు చేశారు. ఈకేసులో ఇప్పటి వరకు ముగ్గురు అరెస్టు కాగా, మరో 6గురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలుస్తుంది. మరోవైపు కిడ్నాప్‌కు గురైన చదలవాడ సాయిగుప్తా, నిందితుడైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భవిశెట్టి గౌతమ్‌ల మద్య ఉన్న ఆర్థిక లావాదేవీల మీద పోలీసులు ఆరా తీస్తున్నారు. సాయిగుప్తా, అతని సంస్థలో పనిచేస్తున్న సతీష్‌రెడ్డిలను కిడ్నాప్ చేసిన నిందితులు మొదట జగద్గిరి గుట్టకు, తరువాత వికారాబాద్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రానికి తీసుకువెళ్లి బంధించి దాడి చేసిన విషయం తెలిసిందే.

## మంత్రి శ్రీధర్ బాబును కలిసిన నవీన్‌కుమార్ మాదిగ



మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కల్సిన దళిత చైతన్య సంఘం అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ

బేగంపేట జూన్ 17,ప్రభాతవార్త

రాష్ట్ర ఐ టీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ మర్యాదపూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా మంత్రికి నవీన్ కుమార్ పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలియజేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే దళితులకు న్యాయం జరుగుతుందని నవీన్‌కుమార్ అన్నారు.కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలతో పేద,బడుగు,బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో నవీన్ కుమార్ మాదిగతో పాటు శేషు,కార్తీక్, రమేష్, పవన్, రాజు, శ్రీను,పావని,రాజేష్,శేఖర్ తదితరులు ఉన్నారు.

## విద్యుత్ తీగలపై వాలిన చెట్టు కొమ్మలు... రాలుతున్న నిప్పు రవ్వలు



బ్రాహ్మణవాడీలో విద్యుత్ తీగలపైన వాలిపోయిన చెట్టుకొమ్మలు.

బేగంపేట జూన్ 17,ప్రభాతవార్త

నగరంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి బేగంపేట బ్రాహ్మణవాడీ మార్గంలో ఉన్న చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై వాలిపోయాయి.దీంతో వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపైన పడటంతో నిప్పు రవ్వలు రాలి పడుతుండటంతో స్థానికులు భయాందోళణలకు గురయ్యారు.బ్రాహ్మణవాడీ,మాతాజీనగర్ కు వెళ్లే ది ఇదే మార్గం కావడంతో వాహనదారులు ఆందోళణ వ్యక్తం చేసారు.వర్షం కురిసిన సమయంలో ఆ చెట్లు నీటిని ఎక్కువగా తీసుకోవడంతో చెట్ల కొమ్మలు బరువై చెట్టు కొమ్మల కింద ఉన్న విద్యుత్ లైన్ పైకి వాలిపోయాయి.దీంతో నిప్పు రవ్వలు రాలిపడుతున్నాయి.ఈ విషయాన్ని స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారని స్థానికులు తెలియజేసారు.వర్షాకాలం ప్రారంభం కాకముందే విద్యుత్ లైన్ల వెంట వంగి పోయిన చెట్ల కొమ్మలను కొట్టి వేసి ఇలాంటి ప్రమాదా లు జరగకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని, బ్రాహ్మణవాడీ,మాతాజీనగర్,బస్తీల వాసులు కోరుతున్నారు.

## ఎస్సీ, ఎస్టీ, బిసిల సంక్షేమానికి కృషి చేస్తాం



శంకర్, సుదేష్‌కు నియామక పత్రాలను అందజేస్తున్న బి.మహేష్‌బాబు

**సైఫాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసిల అభివృద్ధి, సంక్షేమానికి తమ పార్టీకృషి చేస్తుందని, అవసరమైతే ఉద్యమాలు చేయడానికైనా సిద్దమేనని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) రాష్ట్ర అధ్యక్షుడు బి.మహేష్‌బాబు చెప్పారు. ఆదివారం పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో ఆర్‌పిఐ రాష్ట్ర శాఖ సమావేశం జరిగింది. గత ప్రభుత్వ విధానాల వల్ల ఎస్సీ, ఎస్టీ, బిసిలు అనేక ఇబ్బందులకు గురైనారని, ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి, అభివృద్ధికి సంబంధించిన నిధులు దారి మళ్ళాయని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బిసిలకు న్యాయం చేయాలని ఇందుకోసం కొత్త, కొత్త ప్రణాళికలను రూపొందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన సీనియర్ అంబేద్కరిస్టు, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ జనరల్ గద్దం శంకర్‌ను పార్టీ ఉపాధ్యక్షుడిగా, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా జె.ఎల్.సుదేష్ కుమార్‌ను నియమించి, వారికి నియామకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యదర్శి సి.హెచ్. బాలకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అత్తాపూర్ జూన్17,ప్రభాతవార్త :

రాజేంద్రనగర్ మండల పరిధిలోని శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-2008 పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది.పూర్వ విద్యార్థులు దాదాపు 16 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.నాడు పాఠశాలలో గడిపిన మధుర స్మృతులను ,జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషంగా గడిపారు.ఇక్కడ చదివిన విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి దేశ,విదేశాల్లో అత్యున్నత స్థానాల్లో స్థిరపడ్డారు.నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ప్రస్తుతం వారు స్థిరపడ్డ రంగాలు,అనుభూలను మిత్రులతో పంచుకున్నారు.దీంతో పూర్వ విద్యార్థులందరూ ఒకేచోటుకు చేరడంతో సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో విద్య కమిటీ చైర్మన్ పడమటి శ్రీధర్ రెడ్డి,జడ్పిహెచ్ఎస్ ప్రిన్సిపాల్ కిషన్ నాయక్,ఉపాధ్యాయులు నిరంజన్ ,అశోక్ కుమార్, మల్లయ్య,నర్సింహా చారీ,ఇస్మైల్ ,కృష్ణ మూర్తి,ప్రసన్న లక్ష్మీ,లోహా లక్ష్మి,జయశ్రీ,తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ సమస్యలను పరిష్కరించండి

యూసుఫ్‌గూడ, జూన్ 17, ప్రభాతవార్త :

బస్తీలలో నెలకొన్న సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావును కలిశారు.రామారావునగర్ బస్తీతో పాటు, ఆర్‌కెనగర్, గణేష్‌నగర్, హరినగర్, న్యూరామారావునగర్ ప్రాంతాలకు మంచినీరు అర్ధరాత్రి పూట సప్లై అవుతున్నాయని వీటివలన ప్రజలు చాలా ఇబ్బందులకు గురిఅవుతున్నారని తెలిపారు. గతంలో లాగానే సాయంత్రం ఏడు గంటలలోపు మంచినీటి సరఫరా జరిగే విధంగా చూడాలని ఎమ్మెల్యేని కోరారు. అదేవిధంగా రామారావునగర్‌లో ఆగిపోయిన వరద నీటి కాలువ పైకప్పు నిర్మాణం పనులు ప్రారంభించాలని విద్యుత్ సమస్య అధికంగా ఉందని వీటన్నింటిని పరిష్కరించాలని కోరగా అందుకు ఆయన స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో రామారావునగర్ మాజీ అధ్యక్షులు నాగుల సత్యం, బస్తీ అధ్యక్షులు బి.వెంకటయ్యయాదవ్, ఆవుల సంజీవ, భిక్షపతి, రాజాచారి, శివ, తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి

**-టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా**



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా

**ముషీరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా బకాయి ఉన్న 20లక్షల మంది ఫీరియంబర్స్‌మెంట్ నిధులు తక్షణమే విడుదల చేయాలని సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు పూర్తయిన విద్యార్థులకు ఫీ బకాయి ఉందనే కారణంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవటంతో చాలా మంది విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ, పీజీ, వృత్తి విద్యా కళాశాలల విద్యార్థుల పరిస్థితి కూడా అగమ్యగోచరంగా ఉందని, ఫీజు చెల్లించాలంటూ విద్యార్థులపై యాజమాన్యాల వత్తిడి ఎక్కువగా ఉంటోందని అన్నారు. సుమారు తెలంగాణ ప్రభుత్వం కాలేజీలకు 7,800 కోట్లు ఫీబకాయిలు చెల్లించాల్సి ఉందని, దీనివల్ల కళాశాల యాజమాన్యాలకు అధ్యాపకుల జీతభత్యాలు, అద్దెలు, మెయింటెనెన్స్ చార్జీలు భరించలేక గత మూడు సంవత్సరాలలో అనేక కళాశాలలు మూతపడ్డాయని గుర్తు చేశారు. ఫీరీయబర్స్‌మెంట్ పై ఆధారపడి చదువుకుంటున్న అనేక మంది పేదవిద్యార్థులు ఫీజులు కట్టలేక మధ్యలోనే చదువులు మానేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం మార్చి నెలాఖరులోగా 750 కోట్లు డిగ్రీ, పీజీ కళాశాలలకు ఫీబకాయిలు చెల్లిస్తామని టోకెన్లు కూడా జారీచేసింది కానీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి, ఫీ బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్, యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డును ఆక్రమించినా పట్టించుకోని జిహెచ్‌ఎంసి



రోడ్డుకు అడ్డంగా నిర్మించిన రోడ్డు



రోడ్డుకు అడ్డంగా నిర్మించి మరో ఇంటి మెట్లు

తార్నాక, జూన్ 17 ప్రభాతవార్త :

సికింద్రాబాద్ టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పట్టేవిధంగా ఇంటి నిర్మాణదారులు రోడ్డును ఆక్రమించారు. ఈ విషయంపై స్థానికులు టౌన్‌ప్లానింగ్‌లో ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏకంగా రోడ్డును ఆక్రమిచి ప్రహారి గోడను నిర్మించినా పట్టించుకోవడం పట్ల అధికారుల పనితీరుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తార్నాక, లాలాపేట్, విజయపురికాలనీలో ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు కేవలం నోటీసులు ఇచ్చేందుకే పరిమితం అవుతున్నారు. తార్నాక సెయింట్ ఆన్స్ ఎదురుగా ఉన్న చెన్నారెడ్డి రోడ్డులో పలువురు వ్యాపారులు రోడ్డుకు అడ్డంగా డబ్బాలను, హోటళ్లు, చాయ్ డబ్బాలను ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ వారు మామ్ముళ్లు తీసుకోవడంతోనే యదేచ్ఛగా డబ్బాలు పెరిగిపోతున్నాయి. డబ్బాల వారికి విద్యుతు అధికారులు కూడా విద్యు మీటర్లను కూడా ఇస్తున్నారు. కూడా అక్రమ నిర్మాణాలను ఎందుకు పట్టించుకోవడంలేదో టౌనిప్లానింగ్ వారికే తెలియాలి.విజయపురి కాలనీలో రాకపోకలకు అడ్డంగా నిర్మించిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పార్ట్ టైం లెక్చరర్స్ సమస్యలు పరిష్కారించాలి

**సైఫాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం లెక్చరర్స్‌కు ఏడాదికి 12 నెలలపాటు వేతనాలు నెలకు 50 వేల రూపాయల చొప్పున చెల్లించాలని తెలంగాణ స్టేట్ ఆల్ యూనివర్శిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధి బృందం సిఎం కార్యాలయంలో వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డా.బి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి డా.రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ గత 15, 20 సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో 800 మంది పార్ట్ టైం లెక్చరర్స్‌గా పనిచేస్తున్నారని, వీరికి కనీస వేతనం కంటే అతి తక్కువ వేతనం చెల్లించి, ప్రభుత్వం వెట్టి చాకిరి చేయించుకుంటున్నదని ఆరోపించారు. లెక్చరర్స్‌గా అన్ని విద్యార్హతలు ఉన్నప్పటికి వీరికి కనీసం పిఎఫ్, మెడికల్, బీమా సౌకర్యం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడిచినా తమ సమస్యలను పరిష్కారించకుండా ఉందన్నారు. ఇప్పటికైనా సిఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని పార్ట్ టైం లెక్చరర్స్ సమస్యలను పరిష్కారించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## డా. వడ్డేపల్లికృష్ణ జలజలాకురిసే వెలుగువెన్నెలా గీతావిష్కరణ



వడ్డేపల్లికృష్ణ గీతావిష్కరణ కావిస్తున్న తనికెళ్ళభరణి, దయాక్, ప్రసాద్, సతీష్, చంద్రశేఖర్ తదితర ప్రముఖులు

నాంపల్లి, జూన్ 17 ప్రభాతవార్త :

అమెరికా డల్లాస్ మహానగరంలోని శిర్డీసాయి ఆడిటోరియంలో ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం ఆధ్వర్యంలో నెలానెల తెలుగు వెన్నెల ద్విశత మాసోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుప్రసిద్ధ నటుడు, రచయిత తనికెళ్ళభరణి విశిష్ట అతిథులు వి.ఎన్.ఆదిత్య, దయాకర్, తోటకూరి ప్రసాద్, సంస్థ అధ్యక్షుడు బండారు సతీష్, చంద్రశేఖర్ తదితరులతో కలిసి ప్రముఖ గేయరచయిత డా. వడ్డేపల్లికృష్ణ రచించిన జలజలా కురిసే వెలుగు వెన్నెల అనే గీతాన్ని ఆవిష్కరించి వడ్డేపల్లికృష్ణను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు. పాడుతా తీయగా ఫేమ్ శివాత్మిక ఈ గీతాన్ని శ్రావ్యంగా, మృదుమధురంగా గానంచేసి అందరినీ అలరించారు. చివరిగా వి.ఎన్. ఆదిత్య సినీ మాయాజాలంపై ప్రసంగించగా, డా. వడ్డేపల్లి కృష్ణ లలితగీత వికాసంపై ఉపన్యసించారు. జొన్నలగడ్డ సుబ్బు వందన సమర్పణతో సభ ముగిసింది.

## ఉచితంగా ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు

**సైఫాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫోటో గ్రఫీ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా ఆరు నెలల పాటు ఫోటొగ్రఫీ, వీడియోగ్రఫీ రంగాలలో డిప్లొమో కోర్సులు నిర్వహిస్తున్నామని సిగ్మా అకాడమీ చైర్మన్ ఎం.సి.శేఖర్ తెలిపారు. ఫోటోగ్రఫీ అభిరుచిగల వారు, వృత్తిగా స్వీకరించేవారికి ప్రాథమిక ఫోటో గ్రఫీతోపాటు పిక్టోరియల్ షూటింగ్ నైపుణ్యాలను, అధునాతన సాంకేతికతలు, కంపోజిషన్, లైటింగ్, ఫ్రేమ్మింగ్, పోసింగ్‌ల లో అనుభవం కలిగిన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వబడునని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జులై 15వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, ఆసక్తిగల వారు ఈ క్రింది నెంబర్లు 8008021075, 7095692175 ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**దుండిగల్, జూన్ 17 ప్రభాతవార్త:** కెమికల్ ట్యాంకర్ వెల్డింగ్ చేస్తుండగా ట్యాంకర్ పేలిపోవడంతో గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, రోడామేస్త్రినగర్‌కు చెందిన సయ్యద్ ఫారూఖ్(33) బార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఫారూఖ్ ఖాజీపల్లి చౌరస్తా సమీపంలో వెల్డింగ్ షాపు నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో ఈనెల 9వ తేదిన దుండిగల్ తాండా-2కు చెందిన ఒవ్యక్తికి సంబంధించిన కెమికల్ ట్యాంకర్ వెల్డింగ్ పనుల కోసం ఫారూఖ్ వద్దకు వచ్చారు. ట్యాంకర్‌ను వెల్డింగ్ చేస్తుండగా ఒక్కసారిగా పేలిపోవడంతో ఫారూఖ్ తీవ్రగాయాలపాలవడంతో పాటు పేలుధాటికి పరసరాల్లో పార్కింగ్ చేసిన వాహనాల అద్దాలు సైతం ధ్వంసం అయ్యాయి. గాయాలపాలైన ఫారూఖ్‌ను చికిత్స కోసం వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

యూసుఫ్‌గూడ, జూన్ 17, ప్రభాతవార్త :

ఇనుపరాడ్డుతో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధి రహ్మత్‌నగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానికంగా ఉండే బీఆర్‌ఎస్ నాయకుడు అరుణ్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి బోర్‌వెల్స్ లారీ డ్రైవర్‌పై ఇనుపరాడ్డుతో దాడి చేశాడు. అతనికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతనిని చికిత్సకోసం ఆసుపత్రికి తరలించారు.అరుణ్‌పై ఐపిసి సెక్షన్ 307 కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చిక్కిన వందల మంది

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ వందల మంది పట్టుబడిన ఘటన సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలో చోటు చేసుకుంది. తాగి వాహనాలు నడిపేవారిపై సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమీషనర్ డీ.జోయెల్ డేవిస్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16వ తేదీలు శనివారం, ఆదివారం రాత్రిళ్ళు సైబరాబాద్‌లోని పలు ప్రాంతాలలో ట్రాఫిక్ పోలీసులు వాహనదారులపై విస్తృతంగా ఆల్కహాల్ నిర్ధారణ పరీక్షలు చేశారు. 15వ తేదీ ఒక్కరోజే వందకు పైగా కేసులను ట్రాఫిక్ పోలీసులు నమోదు చేశారు. మాదాపూర్, రాయదుర్గం, గచ్చిబౌలీ, రాజేంద్రనగర్, చేవేళ్ళ, మియాపూర్, కుకట్‌పల్లి, బాలానగర్, జీడిమెట్ల, ఆల్వాల్, శంషాబాద్ తదితర ప్రాంతాలలో వాహనదారులను ఆల్కాహాల్ పరీక్షలు చేసి 349 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వారిలో 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలు పైబడినవారున్నారని, అందులో ముగ్గురు మహిళలుండగా, 346 మంది పురుషులున్నట్లు పోలీసులు తెలిపారు. అందులోనూ ద్విచక్రవాహనదారులు అధిక శాతం పట్టుబడినట్లు పోలీసులు వెల్లడించారు. వీరిలో ఫుడ్ డెలివరీ బాయ్ నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వరకూ వివిధ స్థాయిల గల ఉద్యోగులున్నట్లు చెప్పారు. అధికంగా మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో ద్విచక్రవాహనదారులు 253 మంది కాగా, త్రీవీలర్ 16 మంది,ఫోర్ వీలర్ 74 మంది,తాగి హెవీ వెహికిల్ నడుపుతూ పట్టుబడ్డ వారు 6మంది ఉన్నట్లు పేర్కొన్నారు. వీరిపై డ్రంక్ఎండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసిన పోలీ సులు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.అందరికీ చలానాలు వేసి న్యాయస్థానం ముందు హాజరు పరచనున్నారు.

## ప్రజల నీటి ఇబ్బందులు తీర్చేందుకు నూతన బోర్

**- బండ్లగూడ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి**



హైదర్షాకోట్‌లోని శాంతి నగర్ కాలనీలో నూతన బోర్ వేయిస్తున్న డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి.

నార్సింగి, జూన్ 17 ప్రభాతవార్త :

ప్రజల నీటి ఇబ్బందులు దూరం చేసేందుకు నూతన బోర్లు వేయిస్తున్నామని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హైదర్షాకోట్‌లోని శాంతి నగర్‌లో మంచినీటి ఇబ్బందులు దూరం చేసేందుకు డిప్యూటీ మేయర్ తన సొంత డబ్బులతో నూతన బోర్‌ను వేయించారు. పుష్కలమైన నీరు రావడంతో కాలనీ వాసులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు వాడుకునేందుకు సరిపడ నీటి సరఫరా కావడం లేదని, ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను నా దృష్టికి తీసుకు రావడంతో వెంటనే కొత్త బోర్‌ను వేయించానని తెలిపారు. దేవుడి దయ వలన నీరు పుష్కలంగా రావడం జరిగిందని వివరించారు. తొలిసారి ఎన్నికల బరిలో నిలిచినా హైదర్షాకోట్ ప్రజలు మంచి మెజారిటీ ఇచ్చి కార్పోరేటర్‌గా గెలిపించారని, వారికి నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలు తీర్చడం కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. పాలకవర్గ సభ్యులమంతా కలిసి సమిష్టి నిర్ణయాలు తీసుకొని బండ్లగూడ కార్పోరేషన్‌ను అభివృద్ధిలో నెంబర్‌వన్ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, పలువురు సభ్యులు పాల్గొని డిప్యూటీ మేయర్‌కు ప్రత్యేక ధన్యావాదాలు చెప్పారు.

## ఘనంగా మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

హైదరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:

తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం నాచారంలోని ఇఎస్ఐ ఆసుపత్రిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆసుపత్రి హెచ్.వి.భాగ్యలక్ష్మి, హెడ్ నర్సు రాజమణి యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ వ్యవస్థాపకులు డాక్టర్ రాజ్‌బహుదూర్‌గౌర్, రామచందర్ చిత్రపటాలకు ఇఎస్ఐ హాస్పటల్ బ్రాంచి కార్యదర్శి వేణుకుమార్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రులలో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రమోషన్‌లకు అడ్డంకిగా ఉన్న జివొ నెంబరు 126ను రాష్ట్ర ప్రభుత్వం సవరించి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఇఎస్ఐ కార్పోరేషన్‌ను సొసైటిగా మార్చే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ధనరామ్, భాగ్య, సౌందర్య, బాకేశ్వరి, కుమార్, రాఘవేంద్ర, అరుణ తదితరులు పాల్గొన్నారు.



యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న వేణుకుమార్

**మలక్‌పేట ప్రభుత్వ ఏరియా హాస్పటల్‌లో**

రాష్ట్ర ప్రభుత్వ వైద్య శాఖలలో పనిచేస్తున్న వైద్య ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేయాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కళ్యాణం వీరేశ్‌బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మలక్‌పేట ప్రభుత్వ ఏరియా హాస్పటల్‌లో యూనియన్ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు.

## నర్తనశోభ విరాజిల్లిన ప్రీతిక కూచిపూడి రంగప్రవేశం

రవీంద్రభారతి, జూన్ 17 ప్రభాతవార్త :

శ్రీ అకిల భారత కూచిపూడి నాట్యకళా మండలి ఆధ్వర్యంలో ప్రఖ్యాత నాట్యగురువు పశుమర్తి మృత్యుంజయశర్మ శిష్యురాలు పవిరళ అచ్చుత్ దీపిక తనయ ప్రీతిక పవిరళ తల్లిదండ్రుల అశేష ప్రోత్సాహం, కూచిపూడి శాస్త్రీయ నృత్యంపట్ల మక్కువతో కూచిపూడి రంగప్రవేశాన్ని అగ్రేసర నర్తనశోభతో విరాజిల్లింపజేసి అందరి ప్రశంసలందుకుంది. రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులు హర్షవర్ధన్, దాసరి మారుతి, వెంకటాచలపతి, గురువు మృత్యుంజయశర్మ తదితరులు జ్యోతిప్రకాసనంచేసి ప్రీతిక కూచిపూడి రంగప్రవేశాన్ని లాంఛనంగా ప్రారంభించగా ప్రీతిక విశేషమైన శాస్త్రీయ సంప్రదాయ నాట్యాలలో అత్యున్నతశ్రేణికి చెందిన కూచిపూడి నృత్య రంగప్రవేశాన్ని ఆరితేరిన నర్తకిగా నాట్యవిన్యాసం సంప్రదాయ ప్రార్ధనతో ఆరంభించి వివిధ అంశాలను ఆంగిక స్వాతికాభినయాలతో శృతి లయబద్ధంగా అద్భుత హావభావాలను ప్రదర్శించి ప్రశంసలందుకొని విచ్చేసిన అశేష ప్రేక్షకులను కట్టిపడేసింది. గురువు మృత్యుంజయ నట్టువాంగం, డిఎస్‌వి.శాస్త్రి గాత్రం, రాజగోపాలాచార్య మృదంగం, రామరాజు దినకర్ వయోలిన్, మురళి వేణువు, సాయిప్రసాద్ వీణలతో అద్భుత వాద్య సహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు.



ప్రీతిక కూచిపూడి రంగప్రవేశంలో ఒక దృశ్యం

## చదువుకుంటేనే మనకు ..మన కుటుంబానికి గౌరవం

**-బిసిసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య**



బడికిపోదాం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, నీలం వెంకటేష్ తదితరులు

హైదరాబాద్, జూన్ 17,ప్రభాతవార్త:

చదువుకుంటేనే మనకు,మనకుటుంబానికి గౌరవం పెరుగుతుందని బిసిసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య అన్నారు. ఈమేరకు సోమవారం విద్యానగర్‌లో "బడికి పోదాం "కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి,బిసి,ఎస్సీ,ఎస్టీ లు తమ పిల్లలను బడికిపంపాలన్నారు. పిల్లలు చదువుకుంటేనే భవిష్యత్‌లో వారు డాక్టర్లు, ఇంజనీర్లు, కలెక్టర్లు ఇతర ఆఫీసర్లు అవుతారని అప్పుడే ఆకులాలకు గౌరవం పెరిగి అకుటుంబాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. విద్యా,వైద్యం ప్రతి విద్యార్థికి ఇవ్వాలని రాజ్యాంగం ఆదేశించినా స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి ఇప్పటివరకు ఆ ఆశయం నెరవేరలేదన్నారు. ప్రతి ఒకనకరూ చదువుకుంటే వారిలో దాగిఉన్న జ్ఞానం ప్రతిభ బటకు వస్తాయని దీనిమూలంగా దేశం ప్రగతి పథంలో నడుచి భారత దేశం అగ్రదేశంగా తయారవుతుందన్నారు. పటిష్టమైన భారత జాతి నిర్మాణానికి, సమర్ధవంతమైన సామాజిక ఆర్థిక వ్యవస్థ అవసరమని అది విద్యతోనే సాధ్యమన్నారు. కానీ భారతదేశంలో పటిష్టమైన వ్యవస్థ నిర్మాణానికి అనేక రకాల మూడనమ్మకాలు, కులాలు అవాంఛనీయ శక్తులుగా ఎదిగాయని ..ఈఅవాంఛనీయ శక్తులలో ప్రధానంగా కులవ్యవస్థ మొత్తం జాతిపై విచ్చిన్నకర ప్రభావం చూపిస్తూనే ఉందన్నారు. దీన్ని నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు నీలం వెంకటేష్, రాజేందర్, సాయిబాబాలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ' సైన్స్ అండ్ టెక్నాలజీ 'చదవదగిన పుస్తకం : ప్రొఫెసర్ కోదండరామ్

**చిక్కడపల్లి, జూన్ 17 ప్రభాతవార్త:** చదవదగిన పుస్తకం సైన్స్ అండ్ టెక్నాలజీ అని తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. సోమవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో పోటీపరీక్షలకు సన్నద్దమవుతున్న వారి కోసం ప్రముఖ రచయిత పి.మహేష్‌రెడ్డి రచించిన 'సైన్స్ టెక్నాలజీ' పుస్తకావిష్కరణ సభ జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీ ఒక సబ్జెక్ట్ కాదని, అది ఒక దృష్టికోణం అని అన్నారు. పుస్తకం మామూలు విషయం కాదని, ఆఖరి నిమిషం వరకు టెన్షన్ ఉంటుందని, తల్లి పిల్లకు జన్మనివ్వడం ఎంత కష్టం ఉంటుందో రచయితకు పుస్తకాన్ని వెలుగులోని తేవడం అంతే కష్టంగా ఉంటుందని అన్నారు. ఆ కష్టాలన్నీ భరించి పుస్తకాన్ని వెలుగులోకి తీసుకురావడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ ఎస్పీ డి.గాయత్రి తదితరులు పాల్గొన్నారు. ప్రజ్వల్, విజయకుమార్, జయంత్, శ్రీనివాస్, పోలీస్ కానిస్టేబుల్ రాజేశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరామ్,చిత్రంలో ఛత్తీస్‌గడ్ రాష్ట్ర ఎస్పీ అక్షయ్‌కుమార్, బాలలత తదితరులు

## ఎల్ అండ్ టి మెట్రో రైల్‌కు గ్రేట్ ప్లేస్ టు వర్క్ సర్టిఫికేషన్

**చిక్కడపల్లి, జూన్ 17 ప్రభాతవార్త:** హైదరాబాద్ ఎల్ అండ్ టి మెట్రో రైల్ లిమిటెడ్(ఎల్ అండ్ టిఎంఆర్‌హెచ్‌ఎల్) మధ్య పరిమాణం గల సంస్థల కేటగిరీలో పనిచేయడానికి గొప్ప ప్రదేశంగా ధృవీకరించబడింది. వర్క్‌ప్లేస్ కల్చర్‌పై ప్రముఖ గ్లోబల్ అథారిటీ అయిన గ్రేట్ ప్లేస్ టు వర్క్, ఇండియా ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. ఈ సర్టిఫికేట్ రావడానికి ఎల్ అండ్ టి ఎంఆర్‌హెచ్‌ఎల్ తన ఉద్యోగుల కోసం సానుకూల, సాధికారత కలిగిన పని వాతావరనాన్ని పెంపొందించడంలో నిబద్ధతను ప్రస్తావించింది. ఉద్యోగుల శ్రేయస్సు, వృద్ధికి సంస్థ అంకితభావం, విశ్వాసం, గౌరవం, ఆవిష్కరణల సంస్కృతిని సృష్టించడంలో కీలకమైంది. గ్రేట్ ప్లేస్ టు వర్క్ సర్టిఫికేట్ పొందిన పరిశ్రమలో ఎల్ అండ్ టిఎంఆర్‌హెచ్‌ఎల్ మాత్రమే మెట్రో, మొదటి ప్రయత్నంలో 92 అధిక ట్రస్ట్ ఇండెక్స్ స్కోర్‌ను పొందింది. 'పనిచేయడానికి గొప్ప ప్రదేశంగా గుర్తింపు లభించడం సంతోషంగా ఉందని, ఈ పత్రం లభించడం తమ విజయానికి గొప్ప శక్తిని ఇచ్చిందని, ఉద్యోగుల అంకితభావం, కృషికి నిదర్శనమని సంస్థ ఎండి, సిఈవో కెవిబి. రెడ్డి పేర్కొన్నారు. తాము నిర్వహించిన పని వాతావరణాన్ని నిరంతరం మెరుగు పరచడానికి, అందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు.

## ప్రజలను చైతన్యవంతం చేసే రచనలు రావాలి

**- ఆదాయపు పనున్న శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ నరసింహప్ప**



'మేఘసందేశం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆదాయపు పనున్న శాఖ విశ్రాంత చీఫ్ కమీషనర్ ఎం.నరసింహప్ప, చిత్రంలో బిక్కి కృష్ణ, రాధా కుసుమ, రచయిత్రి భువనేశ్వరి

చిక్కడపల్లి, జూన్ 17 ప్రభాతవార్త:

కవులు, రచయితలు ఆధ్యాత్మిక రచనలతో సమాజాన్ని చైతన్యవంతు చేయాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ఆదాయపు పనున్న శాఖ విశ్రాంత చీఫ్ కమీషనర్ ఎం.నరసింహప్ప పేర్కొన్నారు. సోమవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని కళాభారతిలో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ అధినేత, కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన ప్రముఖ రచయిత్రి భువనేశ్వరి మారేపల్లి రాసిన 'మేఘసందేశం' పుస్తకావిష్కరణ సభ జరిగింది. పుస్తకాన్ని నరసింహప్ప ఆవిష్కరించారు.

## భారతీయ సంస్కృతిలో గురుపరంపరకు ప్రాధాన్యత

**-శాసనమండలి సభ్యురాలు సురభివాణిదేవి**

**చిక్కడపల్లి, జూన్ 17 ప్రభాతవార్త:** భారతీయ సంస్కృతిలో గురుపరంపరకు ప్రాధాన్యత ఉందని, కళను నేర్చుకున్న శిష్యులు వారి గురువును గౌరవించడం గురువులు వారి గురువులను స్మరించడం గొప్ప సంస్కారమని శాసన మండలి సభ్యురాలు సురభీవాణిదేవి అన్నారు. సోమవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో చూడామణి అకాడమి ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ నిర్వహణలో ప్రముఖ నాట్యగురువు నెమలికంటి సువర్ణలత తన గురువులు పద్మశ్రీ అడయార్ కె.లక్ష్మణ్, వేదాంతం జగన్నాథశర్మల సంస్మరణలో శిష్యబృందం కూచిపూడి నాట్యప్రదర్శన జరిగింది. ముఖ్యఅతిథిగా సురభివాణిదేవి లాంఛనంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. సువర్ణలత ఐదు దశాబ్దాలకుపైగా కూచిపూడి నాట్యంలో వందల మందికి శిక్షణ ఇచ్చి మంచి కళాకారులుగా తీర్చిద్దారన్నారు. కర్ణాటక సంగీత నాట్య అకాడమి పూర్వ చైర్మన్ వైజయంతి కాశీ మాట్లాడుతూ క్రమశిక్షణ, ఏకాగ్రత, దీక్షలకు నాట్యం సాధనం అని అన్నారు. ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అనంత లక్ష్మి నర్తకీమణులను అభినందించారు. నాట్యప్ర దర్శనలో తొలి అంశంగా పుష్పాంజలితో ఆరం భించి అలరింపు, జతి స్వరం, ఆధ్యాత్మిక రామా యణం తదితర అంశాలు కన్నులపండువగా నర్తకీమణులు నాగచరిత, సాహితీ, లక్ష్మీ, దిలేశ్‌జైన్‌లు నర్తించారు. గురువు సువర్ణలత అరంగేట్రం చేయగా శ్రీవల్లీశర్మ గాత్ర సహకా రాన్ని అందించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

నిజాంపేట్, జూన్ 17, ప్రభాతవార్త

నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నా 1 గంటల వరకు 11కేవీ శ్రీ హోమ్స్ కాలనీ ఫీడర్ పరిధిలోని బృందావన కాలనీ, కెనడి స్కూల్ బ్యాక్‌సైడ్ ఏరియా, అలాగే 11కేవీ మా విల్లాస్, ఏసీ టైర్ పీడర్‌లలో మధ్యాహ్నం 1 గంటల నుండి సాయంత్రం 3:30 గంటల వరకు కెఆర్ సిఆర్ కాలనీ, మమత హాస్పిటల్, బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియాలలో విద్యుత్ ఉండదని బాచుపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

## తలసాని కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



తలసాని శంకర్ యాదవ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు

**అడ్డగుట్ట,జూన్ 17 ప్రభాతవార్త:** మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సోమవారం మారేడ్‌పల్లిలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే ్య పాయల్ శంకర్ పరామర్శించారు. మోండా మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు తలసాని శంకర్ యాదవ్ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సానుభూతిని తెలిపారు.

**పరామర్శించిన ఎస్.ఆర్.నగర్ సీనియర్ సిటీజన్లు . .**

మోండా మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు తలసాని శంకర్ యాదవ్ ఇటీవల మరణించగా సోమవారం ఎస్.ఆర్.నగర్. సీనియర్ సిటిజన్స్‌కౌన్సిల్ సభ్యులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రసాగ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ అధ్యక్షులు బానిక్‌రావ్ పాటీ, ముత్తారెడ్డి, శంకర్, పార్థసారధి, క్రిష్ణారెడ్డి, క్రిష్ణవేవ్ గౌడ్, అరవింద్ గౌడ్,ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారానికి హాజరుకావాలి : శ్రీగణేష్



ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో భేటీ అయినా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,జూన్ 17 ప్రభాతవార్త:**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన తన ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు కవాలని సోమవారం రాష్ట్ర ఐటీ, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిశారు. ఈ నెల 20వ తేదీన కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా అసెంబ్లీ స్పీకర్ హాల్‌లో జరిగే ప్రమాణ స్వీకారానికి హాజరు కవాలని మంత్రి శ్రీధర్ బాబుకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలకు విజ్ఞప్తి చేశారు.

## యాదగిరి గౌడ్ మృతి విచారకరం : ఎమ్మెల్యే తలసాని

**బేగంపేట జూన్ 17,ప్రభాతవార్త**

బేగంపేట డివిజన్ శ్యాంలాల్ బిల్డింగ్ కు చెందిన బీ ఆర్ ఎస్ నాయకుడు యాదగిరి గౌడ్ అనారోగ్యంతో మృతి చెందడం విచారకరమని మాజీ మంత్రి,సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.గడచిన కొద్ది రోజులు క్రితం అనారోగ్యానికి గురైన యాదగిరి గౌడ్ బేగంపేట లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేరి వారం రోజులుగా చికిత్స పొందుతున్నారు.సోమవారం ఉదయం మరణించారు.విషయం తెల్సుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హస్పిటల్‌కు వెళ్లి యాదగిరి గౌడ్ పార్థివదేహాన్ని సందర్శించారు.అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని,సంతాపాన్ని తెలియజేసారు.ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శ్రీహరి,పొన్నబోయిన సురేష్ యాదవ్,నరేష్ ,సీ.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## న్యూ క్లబ్ అధ్యక్షుడిగా నోముల ప్రకాశ్



బాధ్యతలు చేపట్టిన మారేడ్‌పల్లి న్యూ క్లబ్ కార్యవర్గం

**కంటోన్మెంట్,జూన్ 17 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం మారేడ్‌పల్లిలోని ఫ్యామిలీ న్యూ క్లబ్ అధ్యక్షులుగా నోముల ప్రకాశ్ రావ్ ఏక గ్రీవంగా ఎన్నికైయ్యారు. కమిటీ సభ్యులుగా 5 మంది పోటీ పడగా కాచం కిరణ్ కుమార్, వెంకట సాయికుమార్, నరేశ్ రాజ్ అనే ముగ్గురు కమిటీ మెంబర్లుగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. క్లబ్ అధ్యక్షునిగా సోముల ప్రకాశ్ 3వ సారి ఏక గ్రీవంగా ఎన్నిక కావడంతో క్లబ్ కమిటీ మెంబర్లు, సభ్యులందరు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మెంబర్లు మధుసూదన్, సూర్య ప్రకాశ్, చొల్లేటి రమేశ్, ముప్పిడి గోపాల్‌లు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు.

**కెసిఆర్‌ను కలిసిన బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ డైరెక్టర్ షర్వీన్**

**కంటోన్మెంట్,జూన్ 17 ప్రభాతవార్త:** మాజీ ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావ్ (కేటీఆర్)ను బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ డైరెక్టర్ మహంకాలి షర్వీన్ సోమవారం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

**బక్రీద్ సందర్భంగా కోట్లాది రూపాయల గొర్రెలు,మేకల అమ్మకాలు**

**చార్మినార్,జూన్ 17 ప్రభాతవార్త :** పాతనగరంలో బక్రీద్ సందర్బంగా ఆదివారం కోట్లాది రూపాయల పొట్టేళ్లు,మేకల అమ్మకాలు జరిగాయి.కిల్వత్,శాలిబండ,దారుషిఫా,బాబానగర్,కిషన్‌బాగ్,బహదూర్‌పుర,భవానీనగర్ ప్రాంతాలలో వ్యాపారులు గొర్రెలు,మేకలు విక్రయించారు.యాభై కేజీలు నుంచి వంద కేజీల బరువు గల పొట్టేళ్లు ఆదివారం లక్ష రూపాయల వరకు అమ్ముడు పోయాయి. ఈ సందర్బంగా మహ్మద్ క్యాప్ మార్ట్ యజమాని మహ్మద్ ఇలియాస్ బుఖారి మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీకని తెలిపారు.కాగా బక్రీద్ సందర్బంగా పాతబస్తీలో కోట్లాది రూపాయల పొటేళ్లు,మేకలు విక్రయాలు జరిగాయి.

## ఎమ్మెల్యే వివేకానందను కలిసిన పేట్‌బషీరాబాద్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



ఎమ్మెల్యే వివేకానందకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

**పేట్ బషీరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త :** పేట్‌బషీరాబాద్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే వివేకానందను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ బస్తీలో ఇంతకు ముందు మంజీరా కనెక్షన్ పాతది ఉండేది అయితే కొద్ది రోజుల క్రితం డ్రైనేజీ లైన్ వేసినప్పుడు మా బస్తీలో ప్లాస్టిక్ మంజీరాలైన్ మొత్తం జేసీబీతో త్రవ్వివేసారని తెలిపారు. మా బస్తీకి నీళ్ళు వస్తే మొత్తం లీకేజీ అయి మంచి నీళ్ళు వేస్తుగా అయ్యి బస్తీ మొత్తం బురదమయం అవుతున్నదని తెలిపారు. బస్తీకి బీడ్‌లైన్, రోడ్డు, సీసీరోడ్డు కూడా వేయించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే వివేకానంద సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పులి మహేష్ బాబు గౌడ్, పులి చంద్రం గౌడ్, పులి బాలరాజ్ గౌడ్, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్‌లో బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు





బోయిన్‌పల్లి బక్రీద్ వేడుకల్లో జంపన ప్రతాప్,ముస్లిం మైనార్టీలు



బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ముస్లిం సోదరులు



బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

# మతసామరస్యానికి ప్రతీక బక్రీద్

**కంటోన్మెంట్‌లో..**

**కంటోన్మెంట్,జూన్ 17 ప్రభాతవార్త:** మహ్మద్ ప్రవక్త బోధించిన సమైఖ్యతను, సహోదర భావాన్ని అందరు అనుసరించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బోయిన్‌పల్లి, బొల్లారం, మారేడ్‌పల్లి ప్రాంతాల్లో నిర్వహించిన బక్రీద్ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు, ముస్లిం మైనార్టీలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే శ్రీగణేష్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వహాబ్,నయీం, టౌఫిక్, రఫీక్, చిర్రబోయిన సంతోష్ యాదవ్, ఉదయ్ బాను, నరేశ్, వినోద్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

**బోయిన్‌పల్లిలో**

అల్లహ్ అనుగ్రహంతో అందరి జీవితాల్లో అనందం,శాంతి కలగాలని కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం 1వ వార్డు బోయిన్‌పల్లిలో ముస్లిం మైనార్టీలు నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు పెన్షన్‌లైన్ ఈద్గా వద్ద బారీ ఊరేగింపు నిర్వహించి సామూహిక ప్రార్థనలు జరిపారు. అనంతరం ఒకరినొకరు అప్యాయంగా ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నేతలు షిరాజ్, షకీబ్, హుస్సెన్, చోటు, మౌలా, ఆజామ్, ముక్తర్, శ్రీకాంత్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**నిజాంపేటలో..**

**నిజాంపేట్, జూన్ 17, ప్రభాతవార్త :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు దర్గాల్లో బక్రీద్ పండుగ ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా 21 డివిజన్ నూతనంగా ఏర్పాటు చేసిన ఈద్గాలో ముస్లిం సోదరులు ఈద్-ఉల్-అధా ప్రార్థనలు నిర్వహించారు. మైనార్టీ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాచుపల్లి, రాజీవ్‌గాంధీ నగర్, శ్రీసాయి నగర్, రాజీవ్ గృహకల్ప, ప్రగతి నగర్, నిజాంపేట వివిధ కాలనీల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య నాయకులు కలిలుల్లా ఖాన్, ఎండి జహంగీర్, నబీ, సయ్యద్ షకీల్, మోయినిద్దీన్, ఎండి సలీం, ఎండి అజాద్, దర్గా అలీ, ఎండి ఖలీల్, ఎండి హబీబ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేసి, ఒకరినొకరు ఆలింగణం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**కూకట్‌పల్లిలో..**

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 15, ప్రభాతవార్త :** హిందూ ముస్లిం పండుగ ఏదైనా భారతదేశంలో మతసామరస్యానికి గొప్ప ప్రతీకలని పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ అన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి ముస్లిం సోదరులందరికీ బండి రమేష్ శుభాకాంక్షలు తెలిపారు. మూసాపేట్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు మోయిజ్ ఏర్పాటు చేసిన విందుకు కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, సతీష్‌రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, మోహన్‌రెడ్డి, ప్రవీణ్, అరవింద్‌రెడ్డి, ఫణికుమార్‌లతో కలిసి బండి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరుల త్యాగనిరతికి ధర్మ నిబద్ధతకు ప్రతీక బక్రీద్ పర్వదినం అని అన్నారు.

# ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

**గోషామహల్,జూన్,17ప్రభాతవార్త:**

తెలంగాణ నాన్ గజిటెడ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ అన్నారు.గత దఫాలుగా హైదరాబాద్ జిల్లా నాన్‌గజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా కొనసాగుతూ జిల్లాలోని ఉద్యోగుల డిమాండ్ల సాధన కొరకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యలను పరిష్కరించేందుకు గాను తన శక్తి వంచనలేకుండా కృషి చేశాడు. ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైన వెంటనే స్పందించి ఆయా విభాగాల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు.ఉద్యోగులకే కాకుండా సామాజిక రంగాల్లో తన భాధ్యతను నిర్వహించడం జరిగిందన్నారు.ముఖ్యంగా ఏకతాటిగా తెలంగాణ జిల్లాల అధ్యక్షులు,కార్యదర్శులు,ఉద్యోగులతోపాటు సెంట్రల్ కమిటి నాయకులు తనపై నమ్మకంతో గురుతరమైన ప్రధాన కార్యదర్శి పదవి బాధ్యతలో నియమించడం పట్ల కేంద్రసంఘం అధ్యక్షులు మారం జగదీష్,మిగతా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణ ఉద్యోగుల డిమాండ్ల సాధన కొరకు ఎల్లవేలా నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు.సాధారణ ఉద్యోగ స్థాయి నుంచి ప్రస్తుతం తెలంగాణ నాన్ గజిటెడ్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదరి పదవిలో నియమించడం ఎంతో సంతోషదాయకమన్నారు.కేంద్రసంఘంలో ఎందరో అతిరథ మహా నాయకులు నిర్వహించన పదవిలో నియమించడం తెలంగాణ ఉద్యోగులందరి సహాయ,సహాకారాలు ఉన్నట్లు తెలిపారు .ప్రధాన కార్యదర్శి పదవికి వెన్నె తీచ్చేవిధంగా కృషి చేస్తానన్నారు. జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, కేంద్రసంఘం అధ్యక్షులు, కార్యవర్గంప్రతినిధులతో ఎలాంటి సమస్యను చర్చించి ముందుకు వెళ్లే విధంగా పాటుపడుతానన్నారు.ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు.

## కాంగ్రెస్‌లో యువతకు ప్రత్యేక స్థానం, తగిన ప్రోత్సాహం : కాంగ్రెస్ నేత సతీష్‌రెడ్డి

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 17, ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కష్టపడే యువతకు పార్టీ ప్రత్యేక స్థానం తగిన గుర్తింపు ఇస్తుందని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో యువతను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇంచార్జీ పట్నం సునీత మహేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ సహకారంతో కూకట్‌పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరి సతీష్‌రెడ్డి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు కండి శ్రావణ్‌తో చర్చించి నియోజకవర్గం స్థాయి, డివిజన్ నూతన కమిటీని వేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గం యువజన ప్రధాన కార్యదర్శులుగా జేరిపటి రాజు, ఎండీ రావుఫ్, యువజన కార్యదర్శిగా వినయ్‌గౌడ్, యువజన సహాయ కార్యదర్శిగా హరి, ఫతేనగర్ డివిజన్ యువజన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాకేష్‌లను నూతనంగా నియమించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడుతున్న వారికి కాంగ్రెస్ పార్టీలో యువతకు మంచి అవకాశాలు కల్పిస్తుందన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న యువతను కాంగ్రెస్ పార్టీ ఆదరిస్తుందని అందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు యువతకు అండగా ఉంటుందని నియోజకవర్గంలో ఇంకా ఎవరైతే ఉన్నారో వారికి కూడా రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంజీవ, మైఖేల్, ఫణీంద్ర, మహిళ నాయకురాళ్ళ రజిత, జోజమ్మ, కుమ్మబాబు, లోగిరాజు, బాలానగర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్న, సోనూ, రాజు తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీని అభినందిస్తున్న శేరి సతీష్‌రెడ్డి

## నిరుపయోగకరంగా రైల్వే కమర్షియల్ షాప్స్

**కంటోన్మెంట్,జూన్ 17 ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే ఆధీనంలో ఉన్న రైల్వే కమర్షియల్ శాప్‌లను మూసివేయ దంతో సంఘ విద్రోహ శక్తులకు, తాగుబోతులకు అడ్డాగా మారాయి. సికింద్రాబాద్ అసెంబ్లీ పరిధిలోని మెట్టుగూడ చౌరస్తా, న్యూ బ్రిడ్జీ, నార్తలాలాగూడ, నూరీ పాన్ షాప్ ప్రాంతాల్లోని రైల్వే క్వార్టర్స్ ప్రధాన రోడ్డు మార్గాల్లో ఉన్న రైల్వే కమర్షియల్ శాప్‌లను ప్రైవేట్ వ్యక్తులకు అద్దె రూపంలో ఇచ్చారు. వివిధ కారణాలతో రైల్వే ఉన్నతాధికారుల అదేశాల మేరకు గత కొన్ని నెలల క్రితం ఆ షాప్‌లను మూసివేశారు. ఆయా ప్రాంతాల్లో నిరుపయోగకరంగా ఉన్న రైల్వే కమర్షియల్ ఎషాప్‌ల వద్ద తాగుబోతులు, సంఘ విద్రోహ శక్తులు అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతు న్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతా ధికారులు స్పందించి నిరుపయోగకరంగా ఉన్న షాప్‌లను పూర్తిగా నేలమట్టం అయినా చేయాలని, లేని పక్షంలో అవసరం ఉన్న వారికి అద్దె రూపంలో ఇవ్వాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

**కూకట్‌పల్లి ఇన్‌చార్జ్ జోనల్ కమిషనర్‌గా స్నేహ శబరీష్..**

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 17, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి ఇన్‌చార్జ్ జోనల్ కమీషనర్‌గా శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ స్నేహ శబరీష్ బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ జడ్సీగా పనిచేసిన అభిలాష అభినవ్ నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ కావడంతో ఆమె తన బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. కాగా కూకట్‌పల్లి జోనల్ కమీషనర్‌గా స్నేహ శబరీష్‌కు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో తాజాగా ఆమె బాధ్యతలు చేపట్టారు.

## మేనేజ్‌మెంట్ రంగంలో ఉజ్వలమైన అవకాశాలు



ప్రసంగిస్తున్న ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వాహకురాలు రూప

**చిక్కడపల్లి, జూన్ 17 ప్రభాతవార్త:**

నేడున్న పరిస్థితుల్లో మేనేజ్‌మెంట్ రంగంలో ఎంతో విస్తృతమైన అవకాశాలు అందుబాటులో ఉంటున్నారని, వాటిని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని వక్తలు సూచించారు. సోమవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కళాశాలలో ప్లే ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో 'ప్లేస్‌మెంట్ డ్రైవ్' నిర్వహించింది. కళాశాలలో ఎంబిఎ ఫైనల్ ఇయర్ పూర్తి చేసిన వారికి ఉద్యోగవకాశాలు కల్పించాలనే లక్ష్యంగా కళాశాల యాజమాన్యంఈ కార్యక్రమాన్ని చేపట్టింది. పెద్దసంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు ఈ డ్రైవ్‌లో పాల్గొని నైపుణ్యతను ప్రదర్శించుకున్నారు. ప్లే ఇంటర్నేషనల్ సంస్థ బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్(హెచ్‌ఆర్) రూప ఆధ్వర్యంలో అర్హత ఉన్న విద్యార్థినీ విద్యార్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ రిషికాంత్, ప్రిన్సిపాల్ నాగరాజు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి చాగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు. అంబేద్కర్ కళాశాల మేనేజ్‌మెంట్ రంగంలో విద్యనభ్యసిస్తున్న వారికి మరింత ప్రోత్సాహాన్ని అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కళాశాల యాజమాన్యం ప్రకటించింది.

## కృత్రిమ మేధతో విలువలు మానవీయతకు ముప్పు : డాక్టర్ కె.వి.రమణాచారి



రామాచార్యులు రచించిన 'నామస్మరణం-మోక్షదాయకం' ఆధ్యాత్మిక గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కె.వి.రమణాచారి

**చిక్కడపల్లి, జూన్ 17 ప్రభాతవార్త:**

మనుషులను యంత్రాలను మార్చే కృత్రిమ మేధతో సమాజంలో కుటుంబ సంబంధాలు విలువవలు మానవీయతకు ముప్పు వాటిల్లుతుందని విశ్రాంత ఐఎఎస్ అధికారి, ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. సోమవారం డాక్టర్ కె.వి.రమనాచారి క్యాంప్ కార్యాలయంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ బి.రామాచార్యులు రచించిన 'నామస్మరణం-మోక్షదాయకం' ఆధ్యాత్మిక గ్రంథ ఆవిష్కరణ సభ సాధన సాహితీ స్రవంతి అధినేత సాధన నరసింహాచార్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో ముఖ్య అతిథిగా హాజరైన కె.వి.రమణాచారి ఈ గ్రంథాన్ని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు. చిన్న సంపుటి ఐనా రామాచార్యులు పలు విశేషాలను ఆసక్తిగా, గొప్పగా పాఠకులకు అందించారన్నారు. భగవంతుని దర్శనం కొరం తిరుమల వెళ్లే భక్తుల సంఖ్య ఎక్కువ అవుతోందని, కానీ కోర్కెలతో వెళ్లేవారు అధికమన్నారు. భగవత్ నామస్మరణతో ఎందరో మహాపురుషులు సిద్ధి పొందారని, వారిని ఆదర్శంగా నేటితరం వారు తీసుకొని ముందుకు సాగాలని, అట్టివారికోసమే ఈ సంపుటి అని పేర్కొన్నారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇహిక బంధాల నుంచి విధివడటమే ముక్తి అన్నారు. అట్టి ముక్తి సాధనకు నామస్మరణం అవసరమన్నారు. రచయిత రామాచార్యులు సంపుటిలో అక్షర అర్చ చేశారని ప్రశంసించారు. సంపుటిని సమీక్షించిన సినీ గేయ రచయిత డాక్టర్ వెనిగల్ల రాంబాబు మాట్లాడుతూ అంతర్గత శుద్ధికి నామస్మరణ అవసరం అని, దీని వివరాలు రామాచార్యులు తన సంపుటిలో వివరించారన్నారు. సాధన నరసింహాచార్య స్వాగతం పలుకగా శంభుని కుమార్ వందన సమర్పణ చేశారు.

## సేవాలాల్ సేనా రాష్ట్ర కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్

**-పంచసభ్యుల కమిటీ ఏర్పాటు : సంజీవనాయక్**

**చిక్కడపల్లి, జూన్ 17 ప్రభాతవార్త:** సేవాలాల్ సేనా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ సైదానాయక్ పూర్తిస్థాయిలో నియమించినట్లు సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవనాయక్ ప్రకటించారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఉన్న త్రిసభ్య కమిటీ పూర్తిగా విఫలమైనందున ఆ కమిటీని రద్దు చేసి పంచసభ్యుల కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్రిసభ్య కమిటీ రద్దైన తర్వాత ఇంచార్జ్‌గా కొనసాగుతున్న సైదానాయక్‌ను కన్వీనర్‌గా నియమించినట్లు తెలిపారు. గతంలో ఉన్న రాష్ట్ర కమిటీలో కొద్ది మంది తమ స్వార్ధ ప్రయోజనాల కోసం సంఘాన్ని ఉపయోగించుకున్నందున పాత కమిటీ రద్దు చేశామని అన్నారు. అంతేకాకుండా గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఏకపక్షంగా ఒక పార్టీకి మద్దతు తెలపడాన్ని రాష్ట్ర కమిటీ తప్పుపట్టి రద్దు చేశామన్నారు. సేవాలాల్ సేనా కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్, వ్యవస్థాపక ధర్మ జాగరణ జాతీయ అధ్యక్షుడుగా రమేశ్ మహరాజ్, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా స్వరాజ్ నాయక్, ఉద్యోగ సేనా రాష్ట్ర ఇంచారన్జగా మూడావత్ కృష్ణనాయక్, కోకన్వీనర్లుగా బానోత్ హుస్సేన్ నాయక్, వెంకన్న నాయక్, అజయ్‌నాయక్, మోతిలాల్ నాయక్, భాస్కర్ నాయక్, కొర్రా శ్రీను, రాజేష్‌నాయక్, భానోత్ కిషన్‌నాయక్, రవినాయక్, రాముసాయక్ తదితరులు ఏకగ్రీవంగా నియమించినట్లు వివరించారు.

**మంత్రి శీధర్ బాబుకు దేవాలయం కమిటి ప్రతినిధులు వినతి**



రాష్ట్ర ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**చార్మినార్,జూన్ 17 ప్రభాతవార్త :**

రాష్ట్ర ఐటి శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబును సోమవారం హరిబౌలి చారిత్రక శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం కమిటి ప్రతినిధులు కలిశారు.శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం విస్తరణ అభివృద్ధికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ కమిటి ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటి అధ్యక్షులు కె.జగన్మోహన్ పెర్షాద్,కార్యదర్శి కె.దత్తాత్రేయ, కోశాధికారి ఏ.సతీష్ కుమార్,కార్యవర్గ సభ్యులు జి.దినేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం నూతన లైన్లు : చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్

**నార్సింగి, జూన్ 17 ప్రభాతవార్త :**

నార్సింగి మున్సిపల్ పరిధిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం నూతన త్రిఫేజ్ లైన్లు వేయిస్తున్నామని చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం నార్సింగి పరిధిలో విద్యుత్ కేబుల్, త్రిఫేజ్ లైన్స్ పనులను వైస్ ఛైర్మన్ గోపాల విజయ్ బాబుతో కలిసి నాగపూర్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నార్సింగి మున్సిపల్ పరిధిలో చాలా ప్రాంతాలలో త్రిఫేజ్ లైన్‌లు లేక కరెంటు సఫరాలో కొంత ఇబ్బందులు వచ్చేవని, ఆ ఇబ్బందులు దూరం చేయాలని ట్రాన్స్‌కో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇప్పుడు కొత్త లైన్లు వేయడం జరుగుతుందని వివరించారు. నీరు, విద్యుత్ సమస్యలు ఎక్కడ వచ్చినా వెంటనే స్థానిక కౌన్సిలర్లకు తెలియజేయాలని, వారు పట్టించుకోకపోతే నేరుగా నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల ఓట్లతో ప్రజా ప్రతినిదులుగా ఎన్నికయ్యామని, వారిచ్చిన అధికారంతో వారి ఇబ్బందులు దూరం చేసేందుకు అహర్నిషలు కష్టపడుతున్నామన్నారు. కౌన్సిలర్ల సమిష్టి నిర్ణయాలు తీసుకొని ప్రతీ వార్డు పరిధిలో పెద్ద ఎత్తున మౌళిక వసతులు కల్పిస్తున్నామన్నారు. వచ్చే ఆరు నెలల కాలంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని నాగపూర్ణ, విజయ్‌బాబులు వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అరికె దుర్గేష్ యాదవ్, కుతాడి నరేష్ తదితరులు పాల్గొన్నారు



నార్సింగి మున్సిపల్ పరిధిలో విద్యుత్ కేబుల్ పనులు చేయిస్తున్న చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్

## వెంకటేశ్వర స్వామి పుష్కర బ్రహ్మోత్సవాలు



శ్రీవివేకానందనగర్‌లో వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్స వాలు సందర్భంగా 108 కలశాలతో చక్రస్నానంలో పాల్గొన్న భక్తులు

**యూసుఫ్‌గూడ, జూన్ 17, ప్రభాతవార్త :**

శ్రీవివేకానందనగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలో శ్రీభూనీల సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పుష్కర(12) బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ముగిశాయి.ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని పూజించారు. ఉదయమే నిత్యారాధనలు, సేవాకాలం, ద్వారతోరణ, ధ్వజకుంభారాధన,ద్వారా బలిహరణం(మహాపూర్ణాహుతి), శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి, ఉత్సవ మూర్తులకు 108 కలశాలతో చక్కర స్నానం, అలంకరణం తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్ర మంలో ఆలయ చైర్మన్ పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్ అం జమ్మ దంపతులు, బొంతు హరికృష్ణ, సిరికి శ్రీనువాస్, గుత్తికొండ రామకృష్ణ, కాయితీ యాదవరెడ్డి, కలవల ఏడుకొండలు,కొక్కిరాళ్ళ ప్రకాష్‌రావు,రామారావు, పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా శ్రీ జగన్నాథ్ రథ యాత్ర



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

**మైలార్‌దేవ్‌పల్లి,జూన్ 17 ప్రభాతవార్త :** హైదరాబాద్ బెంగాలీ స్వర్ణ శిల్పి వివేకానంద కాళీ మందిరం ఆధ్వర్యంలో జూలై నెల 7వ తేదీన శంషాబాద్‌లోని నడికూడ శ్రీ కాళీ మాతా మందిరంలో అత్యంత వైభవంగా శ్రీ జగన్నాథ్ రథ యాత్రను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మందిరం కమిటి అధ్యక్షులు హేమంత్ దాస్,బరుణ్ రానాలు వెల్లడించారు.మందిరంలో సోమవారం జరిగిన పూజ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నడికూడ్ శ్రీ కాళీమాత మందిరంలో వచ్చే నెల ఏడవ తేదీన వైభవంగా శ్రీ జగన్నాథ్ రథ యాత్రను జరుపుతున్నామని తెలిపారు.కార్యక్రమంలో మందిరం కమిటీ ప్రతినిధులు హేమంత్ దాస్,శంభు నేత రాయ్,సనత దాస్, సుబ్రత దాస్,బరుణ్ రానా,దీపాంకర్ పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE 1-II ADDL DISTRICT JUDGE MEDCHAL- MALKAJGIRI DIST AT: MEDCHAL OS: 489/2022**

Between:
**1. V. Ravi Shankar** S/O Nagendra Sarma Occ: Private employee. Age: 35 Yrs
**2. V. Sai Lakshmi** W/O Ravi Shankar, Age: 29 Yrs, Occ: House Wife, Occ: Nil
**3. V. Venkata Naresh** S/O Namenda Sarma, Age: 30 Yrs All are R/O House No: 8-7-177/49/61 & 62, Swarnadhamanagar, Military Dairy farm, Bowenpally, Secunderabad. **...Plaintiff's**
AND
**1. S. Koti Reddy** S/o Narasa Reddy, Age: 40Yrs, Occ: Chairman, Bharat Health Care (P) Ltd., Ph: 9618008811
**2. Bhava Srija** W/o S. Koti Reddy, Age: 35 Yrs Occ: CEO, Bharat Health Care (P) Ltd Ph: 9618004411
**3. Sunitha Kumari @ Shanthi** W/o not known, Age: 35 Yrs, Occ: Partner, Bharat Health Care (P) Ltd. Ph: 9885940429
**4. Suzan Parimala** W/o Lokpal, Age: 35 Yrs, Occ: Partner, Bharat Health Care (P) Ltd. Ph: 9894888200
**5. N. Kranthi Kumar** S/o Not Known, Age:33 Yrs, Occ: Partner, Bharat Health Care (P) Ltd., Ph: 9666001123 All are C/O Pinnacle Blooms Network, Unit of Bharat Health Care (P) Ltd., Adjacent to Municipal Park, Above Mahesh Bank, Suchitra Circle, Hyderabad, 500067 & R/o Plot No: 50/A Raghavendra Nagar Colony, Quthbullapur, Aeronautical Enclave, HYD, 500067. **...Defendants 1 to 5**

The plaintiff filed the suit for recovery of expenditure incurred to open facility with the brand name of Pinnacle @ Diamond point Bowenpally on franchise basis through Bharat Health Care Pvt an organization for rehabilitation therapy of children with special needs which is established by defendant 1 as chairman, defendant 2 CEO and defendants 3 to 5 are partners.
This is to inform to defendant 1, defendant 2 & defendant 5 to appear before this Hon'ble court on 19/07/2024 at 10:30 AM, either with counsels or personally along with records to defend this case without fail otherwise the case will be decided in your absence.
(By Order of the Court)
**R V SUBBA RAO**
**Advocate**
#5-14-115, Indiranagar Colony, Moulali, Hyderabad, 500040.
**Cell No: 9849685049**

**IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT : SEC'BAD I.A.No. 244 of 2023 IN O.S.No. 380 of 2018**

Between:
**Canara Bank,** Picket Branch, Sec'bad. **...Plaintiff**
AND
**Sri Mamilla Anjaneyulu** **...Defendant**
To
**Sri Mamilla Anjaneyulu** S/o M. Mallesham, aged about 39 years, Occ: Auto Driver, R/o P.No.8, FL-1, Laxmi Nagar, Picket, Sec'bad-500003.
Take Notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.2,19,453/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **25th June, 2024, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.
//By Order of the Court//
**Sd/- N. VENUGOPALA RAO**
**Advocate**
1-2-234/2/1, Plot No.2/P, Road No.4, S.R.L. Colony, Kothapet, Hyderabad. **Cell: 98492 64568**

**IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT : SEC'BAD O.S.No. 1242 of 2021**

Between:
**Canara Bank,** A.F.S. Begumpet Branch, Sec'bad. **...Plaintiff**
AND
**Mr. Saheb Lal Shaik** **...Defendant**
To
**Mr. Saheb Lal Shaik** S/o Shaik Ibrahim, aged about 37 years, Occ: Cab Driver, R/o H.No. 8-2-293/82/J-III/96, Road No.72, Near Jubilee H Public School, Banjara Hills, Hyderabad-500003. Ph No: 9502551662.
Take Notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of **Rs.3,67,167/-** together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **05th July, 2024, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.
//By Order of the Court//
**Sd/- N. VENUGOPALA RAO**
**Advocate**
1-2-234/2/1, Plot No.2/P, Road No.4, S.R.L. Colony, Kothapet, Hyderabad. **Cell: 98492 64568**

## మల్కాజిగిరి ప్రజల సమస్యలు తీర్చే బాధ్యత నాదే : ఈటెల



సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్..

**నేరెడ్‌మెట్, జూన్ 17 ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్‌యూబి, భూగర్భ డ్రైనేజీ, ప్రభుత్వ భూముల క్రమబద్దీకరణ తదితర సమస్యలను పరిష్కరించేందుకు తాను ప్రజలతో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. మల్కాజిగిరి ప్రజలు తనపై నమ్మకం ఉంచి తనకు భారీ మెజార్టీ అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి సోమవారం మున్నూరు సంఘంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజల సమస్యలే తన సమస్యలుగా భావించి వాటి పరిష్కారం కోసం తాను నిత్యం అధికారులతో చర్చించి ప్రజలు సమస్యలను పరిష్కరించే విధంగా బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం డివిజన్ పరిధిలోని రైల్వే వంతెన, కలుషిత చెరువు, నాళాల అభివృద్ధి తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి ఈటెలకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రావణ్ కుమార్, బీజెవైయం రాష్ట్ర మాజీ అధ్యక్షులు భాను ప్రకాష్, బీజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీకె మహేష్, రాష్ట్ర నాయకులు గణేష్‌చారి, వడ్డె సుబ్బారావు, ఓంప్రకాష్, సాయిసురేష్, శ్రీకాంత్, నరసింహ్మా గౌడ్, జగదీష్, గోపాల్, నరేంద్, శివ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

**సఫిల్‌గూడ చెరువును సందర్శించిన ఎంపి ఈటెల...** మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని సఫిల్‌గూడ లేక్ పార్కును మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ సందర్శించారు. పార్కులో మురుగునీటి శుద్ధికరణ యూనిట్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాజ్‌పేయినగర్ అండర్ పాస్, ఆనంద్‌బాగ్‌లో ఎంఎంటీఎస్ స్టాప్, సఫిల్‌గూడ రైల్వే గేట్ వద్ద అత్యవసర అండర్ పాస్, దోమల నివారణ తదితర సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి వాటిని పరిష్కరిస్తానన్నారు.

## త్యాగానికి ప్రతీక బక్రీద్ పర్వదినం : ఎమ్మెల్యే



ప్రత్యేక ప్రార్ధనలను నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, జూన్ 17 ప్రభాతవార్త :** త్యాగానికి ప్రతీక బక్రీద్ పర్వదినమని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. అక్బర్‌బాగ్ డివిజన్‌లోని ఉజాలేష ఈద్గాలో ఎమ్మెల్యే బలాల బక్రీద్ పండుగను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్ధలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు సాంప్రదాయాలకు ప్రతికగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**తీగల అజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో....** మలక్‌పేట నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంఛార్జి తీగల అజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బక్రీద్ పండుగలను పురస్కరించుకుని మాజీ హోంమంత్రి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ, మాజీ ఇంఛార్జి ఆజం అలీలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు చల్లూరి రఘునందన్‌రెడ్డి, నాయకులు గౌర శశిధర్, అభిషేకం, పవన్, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

## దశలవారిగా డివిజన్ సమస్యల పరిష్కారం : కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



కాలనీలో రోడ్లను పరిశీలిస్తున్న నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, జూన్ 17 ప్రభాతవార్త:** హయత్‌నగర్ డివిజన్ జీహెచ్ఎంసీకి చివరన ఉండడంతో మౌళిక సదుపాయాల కల్పన కొంతమేర ఇబ్బందికరంగానే ఉందని... సరైన ప్రణాళికతో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన డివిజన్ పరిధిలోని బ్లడ్‌బ్యాంక్‌కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో తాగునీటి పైప్‌లైన్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు కార్పొరేటర్‌కు సమస్యను విన్నవించారు. భూగర్భ డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్గంధం వ్యాపిస్తోందని, దోమలు ఎక్కువై వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందన్నారు. సరైన రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో వరదనీరు రోడ్డుపై చేరి బురదమయంగా మారుతోందన్నారు. కనీసం నడవడానికి సైతం వీలులేకుండా ఉందన్నారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ... దశలవారిగా సమస్యలను పరిష్కరించి కాలనీవాసులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సభ్యులు గాలయ్య, జంగారెడ్డి, మల్లేష్ యాదవ్, సుధాకర్‌రెడ్డి, యుగందర్, కళ్యాణ్ పాల్గొన్నారు.

## గ్రీన్ రిచ్ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ట్రాన్స్ ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, జూన్ 17 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్ 31 డివిజన్ పరిధిలోని గ్రీన్‌రిచ్ కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన 100 కెవి ట్రాన్స్ ఫార్మర్ ఆదివారం ప్రారంభమైంది. కాలనీలో విద్యుత్ సమస్యలను తీర్చడానికి కొత్తగా ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కాలనీవాసులతో కలిసి నూతన ట్రాన్స్ ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్‌కు చెందిన రమాకాంత్, రవీందర్‌రెడ్డి, మోహన్ కృష్ణలతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

## గోశాలకు స్థలం కేటాయించాలని వినతి

**ఉప్పల్, జూన్ 17 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని తపస్య పౌండేషన్‌కు స్థలం కేటాయించాలని కోరుతూ బిఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పలువురు నేతలు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తపస్య పౌండేషన్, ఆచార్య వేద సింధు బొల్లా విజయ్‌కుమార్ మాట్లాడుతూ గోశాలతోపాటు, యోగశాలకు స్థలం కేటాయించాలని, గోశాల ఏర్పాటు చేసి ప్రజలకు చేయూత అందిస్తామని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్పందిస్తూ గోశాలపాటు, యోగా స్థలం ఏర్పాటుకు స్థలం కేటాయించేందుకు జిల్లా కలెక్టర్‌కు సిపారసు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి స్థలం కేటాయించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వహకులు మహేందం జైస్వాల్, పత్తిపాక లక్ష్మణ్, గంగాదర్ మహజన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ : శ్రీవాణి

**ఉప్పల్, జూన్ 17 ప్రభాతవార్త :** పాత రామంతాపూర్ అంబేద్కర్ కమ్యూనిటి హాల్‌లో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని కార్పొరేటర్ బండారు శ్రీవాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వశక్తితోరాణించి ముందుకు సాగాలన్నారు. మహిళలకు ఉచితంగా శిక్షణనిచ్చి వారికి చేయూత అందిస్తున్నామని తెలిపారు. అంబేద్కర్ కమ్యూనిటిహాల్‌లో శిక్షణ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వనిత జీవన్ సంస్థ నిర్వహకులు ఆకుల సుభాషిని, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు జంగయ్య, బొడ్డుపల్లి ఆనంద్, కొంగర శ్రీనివాస్, అల్లాడి నిరంజన్‌గౌడ్, రాపోలు శ్రీనివాస్, అంజయ్య, మల్లికార్జున్, ట్రైనర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ఉద్యోగుల సందేహాలను నివృత్తి చేసిన టిగారియా నాయకులు



గురుకుల ఉద్యోగుల సందేహాలకు సమాధానాలు ఇస్తున్న టిగారియా నాయకులు

**ఎల్‌బినగర్, జూన్ 17 ప్రభాతవార్త:** సాంఘీక సంక్షేమ గురుకులాల్లో జిఓ 317 అమలు చేయాలని నిర్ణయం తీసుకుని సబ్జెక్టుల వారీగా ఆయా జోన్లు, మల్టిజోన్లలో కేటగిరిల వారీగా ప్రొవిజనల్ సీనియారిటీ లిస్టులను సొసైటీ అధికారులు ప్రకటించారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు. సొసైటీలో పనిచేసే ఉద్యోగుల సీనియార్టీ లిస్టుల ప్రకటన నేపధ్యంలో ఎల్‌బినగర్‌లోని తెలంగాణా గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసిసియేషన్ (టిగారియా) కేంద్ర కార్యాలయంలో ఉద్యోగుల సందేహాలను నివృత్తి చేయడానికి టిగారియా నాయకులు ప్రత్యేక చేపట్టారు. జోన్ల అలాట్ మెంట్, మ్యూచువల్స్, జనరల్ కేటగిరిలో మహిళ ఉద్యోగుల పేర్లు, సీనియార్టీ లిస్టుల తయారీపై ఉద్యోగులు అడిగిన సందేహాలకు వివరంగా సమాధానాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల జెఎసి అధ్యక్షులు మామిడి నారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.మధుసూధన్, నర్సింహులు, గణేష్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

**మహిళా ఉద్యోగుల పాలిట శాపం..జనరల్ కేటగిరి..**

ప్రతి సబ్జెక్టులో జనరల్ కేటగిరిలో పురుషులతో కొందరు మహిళల పేర్లు కూడా ఉన్నాయి. అయితే జనరల్ కేటగిరిలో ఉన్న వారికి కేవలం బాలుర పాఠశాలల్లో మాత్రమే 317 వెబ్ ఆప్షన్స్ చూపెడుతాయని చెబుతుండడంతో జనరల్ కేటగిరిలోని మహిళా ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జనరల్ కేటగిరిలో ఉద్యోగం సాధించడమే తమ పాలిట శాపంగా మారుతుందని ఊహించలేదని, బాలికల పాఠశాలలతో పోలిస్తే బాలుర పాఠశాలలు తక్కువగా ఉంటాయని, దీంతో మళ్లీ సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని వారు ఆవేదనకు గురవుతున్నారు. కాగా జనరల్ కేటగిరిలో ఉన్న మహిళలకు 2018లో పోస్టింగ్స్ ఇచ్చిన సమయంలో బాలికల పాఠశాలలు ఇవ్వడంతో వారు ప్రస్తుతం బాలికల పాఠశాలల్లోనే పనిచేస్తున్నారు. అయితే ఊహించని విధంగా ప్రస్తుతం బాలుర పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉండడం వారిని ఆందోళనకు గురి చేస్తుంది. దీనిపై సెక్రటరీ ప్రత్యేక దృష్టి సారించి తమకు బాలికల పాఠశాలు లేదా బాలికలు మరియు బాలుర పాఠశాలలకు సంబంధించిన ఆప్షన్స్ ఇవ్వాలని జనరల్ కేటగిరి మహిళా ఉద్యోగులు కోరుతున్నారు. జనరల్ కేటగిరిలో మహిళల పేర్లు చేర్చడం వల్ల తాము కూడా నష్ట పోతున్నామని ఆ కేటగిరిలోని పురుష ఉద్యోగులు కూడా పేర్కొంటుండడం కొసమెరుపు.

## ఆర్టీసి డిపో అభివృద్ధికి కృషి చేయాలి : దిల్‌సుక్‌నగర్ డిపో మేనేజర్ హరి



ఆర్టీసి డ్రైవర్లు, కండక్టర్లకు అవార్డులను అందజేస్తున్న డిపో మేనేజర్ హరి

**మలక్‌పేట, జూన్ 17 ప్రభాతవార్త :** ఆర్టీసి డిపో అభివృద్దికి కృషి చేయాలని దిల్‌సుక్‌నగర్ ఆర్టీసి డిపో మేనేజర్ హరి పేర్కొన్నారు. దిల్‌సుక్‌నగర్ డిపోలో ప్రగతి చక్రం అవార్డ్స్ ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డిపోలో అధికంగా ఆదాయం తీసుకువచ్చిన 10 మంది డ్రైవర్స్, కండక్టర్స్ అవార్డులను అందజేసి అభినందనలు తెలియజేసారు. దిల్‌సుక్‌నగర్ డిపోలో అందరూ కలిసి కట్టుగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. అవార్డు గ్రహీతలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరు డిపో అభివృద్దికి కృషి చేయాలని డిపో మేనేజర్ కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వెంకన్న, మెకానికల్ ఫోర్ మెన్ వెంకటేష్, ఎడిసిలు బుచ్చిరెడ్డి, ఎంవియన్ రావ్‌తో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

## సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడిగా రాంబాబునాయక్

**ఎల్.బి.నగర్, జూన్ 17 ప్రభాతవార్త:** సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడిగా అంగోతు రాంబాబునాయక్‌ను ఏకగ్రీవంగా రాష్ట్ర కార్యాలయంలో ఎన్నుకున్నారు. సోమవారం కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న సేవాలాల్ సేన ముఖ్యనాయకుల సలహాలు, సూచనలను అనుసరించి తాజా పరిణామాలపై త్రిసభ్య కమిటి సమావేశమై అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించి సమన్వయంతో సంఘ సిద్ధాంతాలను కట్టుబడి పనిచేయాలని సూచిస్తూ మరోసారి రాంబాబునాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో రెండవసారి సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులుగా నియమించినందుకు త్రిసభ్య కమిటీ సభ్యులకు దానికి సహకరించిన సేవాలాల్ సేన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.



ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికలలో ఘనవిజయం సాధించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న చైతన్యపురి డివిజన్ కాంగ్రెస్ నాయకులు లయన్ డాక్టర్ బి.విజయరంగా, తిరుమల్‌రెడ్డి, ప్రభాకర్ రేపల్లె, సురేష్, తెలంగాణ కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు యేసుబాబు, ఏ.ఉదయభాస్కర్ (ప్రభాతవార్త, ఎల్.బి.నగర్)

## రామంతాపూర్‌లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 17 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా సత్యనగర్, రవీందర్‌రెడ్డినగర్, లక్ష్మిశ్రీకాంత్‌నగర్, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్లు, తాగునీరు తదితర సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్లు, రోడ్లు, తాగునీరు సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలనీలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వర్‌రావు, శంకర్, సూరం శంకర్, మహేందర్, సంధ్య, లక్ష్మి, సాగర్, ప్రశాంత్‌గౌడ్, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్, విజయలక్ష్మి, ముత్యాల మధు, ప్రవీణ్, సంతోష్, పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల్లో సబితమ్మ ప్రత్యేక పూజలు



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సబితఇంద్రారెడ్డి

**ఎల్.బి.నగర్, జూన్ 17 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్‌లోని సౌభాగ్యపురం కాలనీ శ్రీవెంకటేశ్వరాస్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ, కాలనీ కమిటీ సభ్యులు సబితమ్మను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు వెంకట్‌రెడ్డి, సుధాకర్‌గుప్త, సర్సింహారెడ్డి, మూర్తి, నాయకులు మహేశ్వరం నియోజకవర్గ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నెలకొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, కొండ్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, వెంకటేష్‌గౌడ్, జైశ్రీమన్నారాయణ, మహేందర్‌రెడ్డి, శ్యాంగుప్త, పబ్బు శ్రీనివాస్, రమేష్ కుర్మా, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : లచ్చిరెడ్డి



సమస్యలు పరిష్కరించాలని లచ్చిరెడ్డిని కోరుతున్న కాలనీవాసులు

**వనస్థలిపురం, జూన్ 17 ప్రభాతవార్త:** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వీరాంజనేయ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కాలనీవాసులు కోరారు. కాలనీవాసుల విజ్ఞప్తికి స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే ప్రతి సమస్య పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రామయ్య,జనరల్ సెక్రటరీ సుధాకర్‌రావు, జాయింట్ సెక్రటరీ రహీం, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాష, ట్రెజరీ శివశంకరయ్య, సభ్యులు సత్యనారాయణ రెడ్డి, బాబు, రమేష్, అనిల్‌కుమార్, సాయి, ఫణిందర్, పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పైప్‌లైన్ నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేయాలి : చింతల అరుణ

**ఎల్.బి.నగర్, జూన్ 17 ప్రభాతవార్త :** పైప్‌లైన్ నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేంద్రనాథ్ యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్‌లోని శ్రావన్ శ్రీఎంక్లేవ్ నుండి బండ్లగూడ భారత్ పెట్రోల్ బంక్ వరకు రూ.1.20కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వర్షపునీరు వెళ్లేందుకు పైప్‌లైన్ పనులకు సోమవారం కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నూతనంగా నిర్మించబోయే వర్షపునీటి పైప్‌లైన్ పనులు నాణ్యత పరిణామాలలో ఏమాత్రం తగ్గకుండా ప్రజలకు ఏ ఇబ్బంది కలగకుండా భారీ వర్షాలు రాకముందే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వర్క్‌ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కాలనీవాసులు రామ్మోహన్‌శర్మ, మాధవరెడ్డి, నాయకులు రావుల శ్రీనివాస్ గౌడ్, నరేందర్‌రెడ్డి, శ్యామ్ తదితరులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా బక్రీద్ వేడుకలు

### మజీద్‌లు, ఈద్గాలవద్ద భారీగా పోలీస్ బందోబస్తు



ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

**తుర్కయంజాల్, జూన్ 17 ప్రభాతవార్త :** త్యాగానికి ప్రతికగా ప్రతియేటా నిర్వహించే బక్రీద్ పండగను తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. రంజాన్ పండుగ మాదిరిగానే బక్రీద్ పండగను ఘనంగా నిర్వహించుకోవడం అనవాయితిగా వస్తుంది. ఈ సందర్భంగా ముస్లింలు సమాధుల వద్ద ఇష్టమైన దుస్తులు, పూలు ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ పండగను పురస్కరించుకుని గొర్రెలను బలి ఇచ్చారు. అదేవిధంగా పేదలకు పండ్లు పంపిణి చేశారు. ముస్లింలు మజీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇమామ్‌లు బక్రీద్ పండగపై ప్రత్యేక సందేశాలు అందించారు. మున్సిపాలిటీలోని మసీదుల వద్ద ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పోలీసులు ముందు జాగ్రత చర్యగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ సలీం, ఎండి రషీద్, జల్కదర్ ఆలీ, సజాత్‌అలీ, ఎండి వాలిద్దీన్, ఎండి షకీల్ , సయ్యద్ నజీబ్, ఎండి ఫార్వాజ్, సలీం ఖాన్,తదితరులు పాల్గొన్నారు.

## త్యాగానికి నిదర్శనం బక్రీద్ : భాస్కర్‌రెడ్డి



ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న దేప భాస్కర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూన్ 17 ప్రభాతవార్త:** త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందని టిపిసిసి సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్టీఆర్‌నగర్ మజీద్ వద్ద సోమవారం భాస్కర్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్లాం ప్రవక్తల్లో ఒకరైన ఇబ్రహీం, అల్లాహ్ ఆజ్ఞను శిరసావహించి తన కుమారుడిని సైతం బలి ఇచ్చేందుకు సిద్ధం కావడాన్ని స్మరిస్తూ ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ జరుపుకుంటున్నారని అన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా, దేవుడిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం సాగించాలని బక్రీద్ పండుగ మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం సీనియర్ నాయకుడు ఎస్‌కె.మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఓల్డ్ బాలాజీనగర్‌ను ముంచెత్తిన వరద, మురికి నీరు - ఇబ్బందుల్లో ప్రజలు..

**సరూర్‌నగర్, జూన్ 17 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జనప్రియా మహానగర్ సమీపంలోనున్న ఓల్డ్ బాలాజీనగర్ కాలనీని ఆదివారం డ్రైనేజీ, వర్షపు వరద నీరు ముంచెత్తింది. ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఎగువ ప్రాంతాలైన జనప్రియామహానగర్, అయోధ్యనగర్, లెనిన్‌నగర్ మురికివాడలనుండి వరదలా వచ్చిన వర్షపునీటితో పాటు ఉప్పొంగిన డ్రైనేజీల నుండి వచ్చిన మురికి నీరు కాలనీని ముంచెత్తింది. దీంతో ఓల్డ్ బాలాజీనగర్ కాలనీలోని అంతర్గత రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి. ఎస్ఎన్‌డిపి నాలా పనులు సకాలంలో పూర్తికాకపోవడంతో ముంపు సమస్యలతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మామూలు రోజుల కంటే వర్షాలు కురిసినప్పుడల్లా పరిస్థితి దారుణంగా ఉంటున్నది. ఇళ్ళ ముందు నుండి మురికి నీరు, వర్షపు నీరు వచ్చి చేరడంతో కాలనీవాసులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఎస్ఎన్‌డిపి నాలాల వల్ల ఈ సమస్యలు తీరుతాయి అనుకుంటే వర్షాకాలం ప్రారంభమైనా పూర్తి కాకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ఎస్ఎన్‌డిపి పనులు పూర్తి చేయండి: మధుసూదన్‌రావు...** ఎస్ఎన్‌డిపి నాలా నిర్మాణపు పనుల జాప్యం వల్లే కాలనీలో వరద, మురికి నీరు సమస్యలు తలెత్తుతున్నాయని ఓల్డ్ బాలాజీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రావు అన్నారు. వర్షాకాలం వచ్చినా పనులు పూర్తి చేయకపోవడాన్ని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారని ఇందుకు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ సమాధానం ఇవ్వాలని స్పష్టం చేశారు. కాలనీలోని రోడ్లపై వరద నీరు, మురికి నీరు చేరడంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చొరవ తీసుకొని అధికారులకు ఆదేశాలివ్వాలని ఆయన కోరారు.

## కుర్మల్‌గూడ, బాలాపూర్ పరిధిలో ఈదురు గాలులకు నేలకూలిన చెట్లు



నేలకూలిన చెట్లను తొలగిస్తున్న సానిటరీ ఇన్స్‌పెక్టర్ యాదగిరి

**సరూర్‌నగర్, జూన్ 17 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లల్లో ఆదివారం కురిసిన భారీ వర్షం భీభత్సం సృష్టించింది. భారీ ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పలు చోట్ల చెట్లు నేలకూలాయి. కుర్మల్‌గూడ, బాలాపూర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గాలుల ధాటికి భారీ వృక్షాలు నేలకొరిగాయి. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు. రోడ్లపై అడ్డంగా చెట్లు నేల కూలడంతో కార్పొరే షన్ అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో కమీషనర్ జి.రఘు ఆదేశాల మేరకు సానిటరీ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరి తక్షణమే స్పందించి చెట్లు కూలిన ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితి సమీక్షించారు. ఈ మేరకు రోడ్లపై అడ్డంగా పడిన చెట్లను జెసిబితో తొలగింపజేశారు. కుర్మల్‌గూడలో నేలకూలిన చెట్లను స్వయంగా ఎస్ఐ యాదగిరి నరికి తొలగించి రోడ్డును క్లియర్ చేయడం గమనార్హం.

## ఉప్పల్ డివిజన్ కుమ్మరి బస్తీలో సిసి రోడ్డు పనులు : కార్పొరేటర్ రజితరెడ్డి



కుమ్మరిబస్తీలో రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజితరెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 17 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ కుమ్మరిబస్తీలో రూ.30లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ మందముల రజితరెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కుమ్మరిబస్తీలోని అన్ని వీధులలో కొత్త సిసి రోడ్డు వేయిస్తున్నామని తెలిపారు. పనుల విషయంలో నాణ్యత పాటించాలని, ప్రజలు ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేయాలని కోరారు. కుమ్మరిబస్తీలో డ్రైనేజీ సమస్య పూర్తి స్థాయిలో పరిష్కరించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా బస్తీలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు గుమిడెల్లి శంకరయ్య, కృష్ణ, అండాలు, సల్ల ప్రభాకర్‌రెడ్డి, ఎం.రాఘవేంద్ర, పి.వెంకటేష్, జి.లక్ష్మణ్, జి.సురేష్, రాజు, రాజేందర్, బాలకిషోర్, ఉదయ్, కన్నమైన బాలరాజు, శేఖర్, నరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరు క్యాంపు కార్యాలయంలో నూతనంగా టీఎస్‌సీఏబి వైస్‌చైర్మన్‌గా ఎన్నికైన కొత్తకుర్మ సత్తయ్య ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న దృశ్యం. (ప్రభాతవార్త, తుర్కయంజాల్)